ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి దిన పత్రిక కొత్త చందాదారులుగా చేరదలచుకున్నవారు, ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఏమైనా సమస్యలుంటే క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

A.C.O - 9003200801
S.R - 9551168092

27/11, సౌందరరాజన్ స్ట్రీట్, టి.నగర్, చెన్నై-600017



ఫలితాల వెల్లడి అనంతరం విజయోత్సాహంతో శశిధర్‌రెడ్డి బృందం

ఆస్కా అధ్యక్షుడిగా శశిధర్‌రెడ్డి

● 'మెంబర్స్ వాయిస్' ప్యానల్ జయకేతనం

చెన్నై, మే 19 (ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రా సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ (ఆస్కా) అధ్యక్షుడిగా జి.శశిధర్‌రెడ్డి ఎన్నిక య్యారు. అంతేగాక ఆయన నేతృత్వం వహించిన 'మెంబర్స్ వాయిస్' ప్యానల్ ఘన విజయం సాధించింది. 'ట్రెండ్ సెట్టర్స్' ప్యానల్‌కు చెందిన గోపాలకృష్ణారెడ్డి తప్ప మిగిలిన పదవులన్నింటినీ మెంబర్స్ వాయిస్ ప్యానల్ సొంతం చేసుకోవడం విశేషం. ఆస్కాలో విభేదాల కారణంగా 2017లో జరగాల్సిన కమిటీ ఎన్నికలు తాజాగా ఆదివారం జరిగిన విషయం తెలిసిందే. ఇందులో ప్రధానంగా రెండు ప్యానళ్లు పోటీ చేశాయి. 2600 మంది సభ్యులున్న ఆస్కాలో మధ్యాహ్నం 2.30లకు ఎన్నిక ప్రారంభం కాగా 1200 కన్నా తక్కువ ఓట్లే పోలైనట్లు సమాచారం. ఆదివారం రాత్రి 9.30 గంటలకు ఓట్ల కౌంటింగ్ ప్రారంభం కాగా, సోమవారం ఉదయం వరకూ కొనసాగింది. అనంతరం ఫలితాలను ఎన్నికల అధికారులు టీవీ కృష్ణకుమార్, ఎంఆర్ రవికుమార్, ఎ.వెంకటరెడ్డి ప్రకటించారు. అధ్యక్షుడిగా జి.శశిధర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా వై.రాజేశ్వరరావు, కార్యదర్శిగా వడ్లమూడి దిలీప్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా మాదాల వెంకటసుబ్బారావు, కోశాధికారిగా ఎల్.శాంతకుమార్, సాంస్కృతిక కార్యదర్శిగా ఎం.భానుచందర్, కమిటీ సభ్యులుగా మన్నూరు చలపతి, డి.రవిచందర్, మదన గోపాల్‌రావు, పి.రమేష్ రెడ్డి, ఎస్‌కే దుర్గాప్రసాద్, దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి, టి.రాజేష్, ఎస్‌పి.శ్రీనివాస్, గోపాలకృష్ణారెడ్డి, ట్రస్టీలుగా కోటారెడ్డి వేమిరెడ్డి, వి.విజయేందర్‌రావు, పి.మనోహర్ రెడ్డి. వి.బాలాజీ, ముంద్రు శ్రీనివాసరావు, వి.ప్రశాంత్, పి.సంతోష్‌కుమార్, బీవీఎస్ కోటేశ్వరరావు, ఎన్ఎన్ భిక్షం విజయం సాధించారు.

'నైరుతి'లో సమన్వయంతో పనిచేయండి

● అన్ని శాఖలకు సీఎం ఆదేశం ● రుతుపవన వర్షాలపై సమీక్ష





పోలీస్ క్వార్టర్స్‌కు శంకుస్థాపన చేస్తున్న సీఎం

చెన్నై, మే 19 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రంలో కురిసే వర్షాల కారణంగా తలెత్తే నష్టం, ప్రమాదాలపై అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు, అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆదేశించారు. సోమవారం స్థానిక సచివాలయ ప్రాంగణంలో ఉన్న కవిజ్ఞర్ మాలిగైలో సీఎం నైరుతి రుతుపవన వర్షాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత నాలుగేళ్లలో అనేక ప్రకృతి విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొన్నామన్నారు. అయితే ప్రస్తుతం ప్రకృతిలో ఊహించని మార్పులు తలెత్తుతున్నాయని,ఈ కారణంగా భారీ వర్షాలు, తుఫానులు, వరదలు సంభవిస్తున్నాయన్నారు. ఈ విపత్తుల నుంచి రాష్ట్ర ప్రజలను రక్షించాల్సి ఉందన్నారు. నైరుతి రుతుపవనాల కాలంలో సాధారణ వర్షపాతమే నమోదవుతుందని భారత వాతావరణ శాఖ అంచనా వేసిందన్నారు. అయితే, పశ్చిమ కనుమ ప్రాంత జిల్లాలు సహా కోస్తా తీర ప్రాంతాల్లో కురిసే భారీ వర్షాల కారణంగా ఆయా ప్రాంతాల్లో నష్ట నివారణ చర్యలతో పాటు ప్రజల రక్షణపై దృష్టి సారించాల్సి ఉందన్నారు.ఈ నైరుతి రుతుపవన సమయంలో అన్ని జిల్లాల కలెక్టర్ల నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు సమన్వయంతో పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు. కంట్రోల్ రూం సేవలు 24 గంటల పాటు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వరద సహాయక చర్యల కోసం అవసరమైన ఉపకరణాలు, సామగ్రిని సిద్ధం చేసి ఉంచుకోవాలన్నారు. వరద బాధితులకు అందజేసేందుకు వీలుగా ఆహారం, తాగునీరు వంటివి నిల్వ చేసి ఉంచుకోవాలన్నారు. ముందస్తు హెచ్చరికలను పరిగణనలోకి తీసుకుని నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు.ఇందుకోసం అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సీఎం స్టాలిన్ సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందంతో పాటు ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రూ.457 కోట్లతో 1118 పోలీస్ క్వార్టర్స్

స్థానిక థౌజండ్‌లైట్‌తో పాటు కోయంబత్తూరు జిల్లా పొల్లాచ్చిలో నిర్మించనున్న 1118 పోలీస్ గృహ సముదాయ భవనాలకు ముఖ్యమంత్రి స్టాలిన్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ భవన నిర్మాణాల కోసం ప్రభుత్వం రూ.457 కోట్లను ఖర్చు చేయనుంది. రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వం (2021) అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు రూ.509.49 కోట్లతో 3051 పోలీస్ క్వార్టర్స్, రూ.59.75 కోట్లతో 51 పోలీస్ స్టేషన్లు, రూ.122.40 కోట్లతో పోలీస్ శాఖకు చెందిన ఇతర భవనాల నిర్మాణాలను పూర్తి చేసి ప్రారంభించడం జరిగింది. అలాగే, ఇపుడు కొత్తగా మరో 1118 పోలీస్ క్వార్టర్స్‌ను నిర్మించేందుకు సీఎం స్టాలిన్ శంకుస్థాపన చేశారు.



మదురై యానైక్కల్ ఫ్లైఓవర్ దిగువ ప్రవహిస్తున్న వర్షపు నీరు



తిరుచ్చి ఎంజీఆర్ విగ్రహం కూడలి వద్ద కురుస్తున్న వర్షం



జలమయమైన కోయంబత్తూరు స్టేట్ బ్యాంక్ రోడ్డు

కుండపోత

మదురై, తిరుచ్చి, కోవై జిల్లాల్లో జనజీవనం అస్తవ్యస్తం

టి.నగర్, మే 19 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాలు నిర్దేశ కాలానికి ముందే రావడం, బంగాళాఖాతంలో అల్పావాయుపీడనం తోడవడంతో రాష్ట్రంలో అగ్ని నక్షత్రం మండుటెండల నుంచి ప్రజానీకాన్ని కాపాడేలా అకాల వర్షాలు కురుస్తున్నాయి. రెండు రోజులుగా కురిసిన వర్షాలకు మదురై, తిరుచ్చి, కోయంబత్తూరు నగరాల్లో జనజీవనం స్తంభించింది. ఆదివారం సాయంత్రం మదురై నగరంలోని గోరిపాళయం, సింహక్కల్, ఆరప్పాళయం, తత్తనేరి, అన్నా బస్టాండు, తల్లాకుళం, మాట్టుతావని, పెరియార్ బస్‌స్టేషన్, కాళవాసల్ సహా సబర్బన్ ప్రాంతాలైన మేలూరు వాడిపట్టి, చోళవందాన్, నాగమలై, పుదుకోట, సిలైమాన్, తిరుప్పరంకుంద్రం, తిరుమంగళం ప్రాంతాల్లో మెరుపులు, పిడుగులతో భారీగా వర్షాలు కురిశాయి. గంటకు పైగా కురిసిన ఈ వర్షాలకు రహదారులు, పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. నగరంలోని సబ్‌వేలు, పల్లపు ప్రాంతాల్లో నీరు ఉధృతంగా ప్రవహించింది. మదురై యానైక్కల్ వంతెన దిగువ వైగై నదీ పరీవాహక ప్రాంతాల్లో వర్షపు నీరు అడుగు లోతున ప్రవహించింది. దీనితో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

తిరుచ్చిలో...

తిరుచ్చి నగరాన్ని ఆదివారం మధ్యాహ్నం వరకూ ఎండ ముప్పుతిప్పలు పెట్టింది. ఆ తర్వాత ఉన్నట్టుండి ఆకాశంలో కారు మబ్బులు కమ్ముకుని తేలికపాటి జల్లుతో ప్రారంభమైన వర్షం సాయంత్రం కుండపోతగా కురిసింది. రాత్రి 8 గంటల నుంచి 10 గంటల వరకు మళ్లీ భారీ వర్షం కురిసింది. సోమవారం వేకువజామున 3గంటలకు మళ్ళీ వర్షం ప్రారంభమైంది. దీనితో నగరంలో ప్రధాన రహదారుపై నీరు ఉధృతంగా ప్రవహించింది. తిరుచ్చి జిల్లాలో 106 మి.మీ, కల్లకుడిలో 107.4 మి.మీ, నందియారు ఆనైకట్టు వద్ద 674. మి.మీ వర్షం నమోదైనట్టు అధికారులు ప్రకటించారు.

12 జిల్లాలకు భారీవర్ష సూచన

నైరుతి రుతు పవనాలు అండమాన్, నికోబార్ దీవుల్లో విస్తరించిన కారణంగా వాతావరణంలో కలిగిన మార్పుల ప్రభావం వల్ల రాష్ట్రంలోని 12 దక్షిణ జిల్లాల్లో మంగళవారం మోస్తరు నుంచి భారీవర్షాలు కురిసే అవకాశముందని ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్ర హెచ్చరించింది. దీనిపై దక్షిణ మండల వాతావరణ పరిశోధన కేంద్రం చైర్మన్ అముద సోమవారం మీడియాకు వివరించారు. నైరుతి రుతుపవనాలు ఈ నెల 24వ తేదీన కేరళ రాష్ట్రాన్ని తాకే అవకాశముందని తెలిపారు. దక్షిణ అరేబియా సముద్రంలో 21వ తేదీ ఏర్పడనున్న ఉపరితల ఆవర్తనం క్రమక్రమంగా బలపడుతోందని ఇది మరుసటి రోజుకి ద్రోణిగా మారే అవకాశం ఉందని తెలిపారు. నైరుతి రుతుపవనాల ప్రభావం వల్ల కొండలు అధికంగా ఉన్న నీలగిరి, కోయంబత్తూరు, కృష్ణగిరి, దిండుగల్, తిరుప్పూర్, ఈరోడ్, ధర్మపురి, సేలం, తిరుపత్తూరు, వేలూరు, రాణీపేట, తిరువణ్ణామలై జిల్లాల్లో మంగళవారం నుంచి భారీవర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

జలదిగ్బంధంలో కోయంబత్తూరు

వాణిజ్య నగరం కోయంబత్తూరులో ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం ఒంటిగంట దాకా ఎండవేడిమి కొనసాగింది. ఆ తర్వాత ఉరుములు, మెరుపులతో భారీగా వర్షం కురిసింది. గాంధీపురం, ఉక్కడం, రైల్వేస్టేషన్, పీళమేడు, శరవణపట్టి, గణపతి, రామనాథపురం, సింగనల్లూరు, గౌండంపాళం, ఒండిపుదూరు, సూలూరు, తొండాముత్తూరు తదిత ప్రాంతాల్లో వర్షం కురిసింది. అరగంటకు పైగా వర్షం కురవటంతో అవినాశి సాలై, శక్తిసాలై, తిరుచ్చి రోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో రహదారులపై వర్షపు నీరు వరదలా ప్రవహించింది. కోయంబత్తూరు కార్పొరేషన్ పరిధిలోని హడ్కో కాలనీ, మురుగన్‌నగర్, ఆర్కేఎంసీ కాలనీ, పట్టాలమ్మన్ కోవిల్ వీధి, ఎల్లైతోట్టమ్ నాలుగో వీధిలో ఉన్న ఇళ్లలోకి వర్షపు నీరు చొరబడింది. ఇదే విధంగా ఆర్ఎస్‌పురం 73 వ వార్డు పీఎంసామి కాలనీ, రెండో వీధిలోని 30కిపైగా ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. వర్షం కారణంగా హైదరాబాద్, ముంబాయి నుంచి వచ్చిన రెండు విమానాలు ల్యాండింగ్ కాలేకపోయాయి. 20 నిమిషాలపాటు ఆకాశంలోనే చక్కర్లు కొట్టిన మీదట ఆ రెండు విమానాలు వరుసగా ల్యాండింగ్ అయ్యాయి.

సేలం, నామక్కల్‌లో కుండపోత...

సేలం, నామక్కల్ జిల్లాల్లో ఆదివారం వేకువజామును కురిసిన కుండపోత వర్షాలకు జనజీవనం స్తంభించింది. గత రెండు రోజులుగా సేలం జిల్లా అంతటా చెదురుముదురుగా వర్షాలు కురిశాయి. ఆదివారం 10 గంటల ప్రాంతంలో సేలం, మేట్టూరు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో వర్షం కురవటంతో రహదారులు, పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఏర్కాడులో ఆదివారం సాయంత్రం తేలికపాటి జల్లులతో ప్రారంభమైన వర్షం రాత్రి కుండపోతగా మారింది. నామక్కల్ జిల్లాలోనూ గత రెండు రోజులుగా ఓ మోస్తరుగా వర్షాలు కురిశాయి. రాశిపురం, చంద్రశేఖరపురం, గురుసామిపాళయం, పుదుపట్టి, వడుకం, కాక్కావేరి, ముత్తుకాళిపట్టి, అండగలూరు గేట్, మంగళాపురం తదిత ప్రాంతాల్లో ఆదివారం రాత్రి నుంచి సోమవారం వేకువజాము వరకూ వర్షాలు కురిశాయి. నామక్కల్ నగరంలోనూ ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం వేకువజాము దాకా ఓ మోస్తరుగా వర్షాలు ఉరిశాయి. సేలం రోడ్డు, పరమత్తిరోడ్డు, తిరుచెంగోడు రోడ్డు తదితర రహదారులు జలమయమయ్యాయి. ఎరుంబట్టిలో 60.మి.మీ, కుమారపాళంలో 34.2 మి.మీ, మంగళాపురం 18.4 మి.మీచొప్పున వర్షపాతం నమోదైంది.

చెన్నైలో స్వల్ప వర్షం

సోమవారం ఉదయం నుంచి చెన్నైతో పాటు శివారు ప్రాంతాల్లోనూ చెదురుమదురుగా వర్షం కురిసింది. సాయంత్రం వరకు ఆకాశం మేఘావృతమై ఉండగా, అప్పుడప్పుడు కొన్ని ప్రాంతాల్లో స్వల్ప జల్లులు కురిశాయి.



హత్యకు గురైన దైవశిఖామణి - అలమేలు

వృద్ధులే లక్ష్యం

● దోచుకోవడం, దాడి చేయడం

● ఐదుగురి హత్య కేసులో వీడిన మిస్టరీ ● ముగ్గురి అరెస్టు



అరెస్టయిన నిందితులు



హత్యా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



నిందితులను కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలిస్తున్న పోలీసులు



నగల దుకాణం యజమాని జ్ఞానశేఖరన్

అడయార్, మే 19 (ఆంధ్రజ్యోతి): వెస్ట్ జోన్‌లో ఇటీవల జరిగిన వరుస హత్యా కేసుల్లో నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో ముగ్గురు హత్య చేసిన నిందితులు కాగా, మరొకరు వీరికి సహాయకారిగా ఉన్న నగల దుకాణం యజమాని. వీరు ఒంటరిగా ఉండే వృద్ధ దంపతులను హత్య చేసి, వారి నగలు, నగదును దోపిడీ చేసేవారని వెస్ట్ జోన్ ఐజీ సెంథిల్ కుమార్ తెలిపారు. ఇదే విషయంపై ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ... ఈరోడ్, పల్లడంలలో జరిగిన ఐదుగురి హత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్టు తెలిపారు. ఈ హత్య కేసుల్లో ఇంకా ఎంతమందికి సంబంధం ఉందన్న విషయంపై నిందితులను విచారిస్తున్నామని చెప్పారు. ఈరోడ్ జిల్లా శివగిరి సమీపంలోని మోహనరాయన్ గార్డెన్‌లో ఒంటరిగా ఉండే రామస్వామి, భాగ్యమ్మాల్ దంపతులు ఇటీవల అనుమానాస్పదంగా హత్యకు గురికాగా, స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి, అరసలూరు ప్రాంతానికి చెందిన ఆచ్చియప్పన్ (48), మాదేశ్వరన్ (53), రమేష్ (52)ని అరెస్టు చేసినట్టు తెలిపారు. అలాగే, వీరు చోరీచేసిన బంగారు నగలను కరిగించిన నగల దుకాణ యజమాని జ్ఞానశేఖరన్‌ను కూడా అరెస్టు చేశారన్నారు. ఇదిలావుంటే, తిరుపూరు, ఈరోడ్ ప్రాంతాల్లో ఇళ్లలో ఒంటరిగా ఉన్న వృద్ధ దంపతులను లక్ష్యంగా చేసుకుని ఈ ముగ్గురు నిందితులు దోపిడీలకు పాల్పడినట్టు పోలీసులు గుర్తించారని చెప్పారు. గత ఏడాది నవంబరు 28న ఇంటిలో ఒంటరిగా ఉన్న దైవశిఖామణి (75), ఆయన భార్య అలమేలు (73), కుమ అరుడు సెంథిల్ కుమార్ (46) హత్య కేసు మిస్టరీగా మారిన నేపథ్యంలో ఇపుడు అరెస్టుచేసిన ముగ్గురు నిందితులకు హత్యతో సంబంధం ఉండివుండొచ్చని సందేహించామన్నారు. వారిని విచారించగా నేరాన్ని అంగీకరించినట్టు తెలిపారు. దీంతో 2024లో జరిగిన మూడు హత్య కేసుల్లోని మిస్టరీ వీడిందని తెలిపారు. ఇపుడు అరెస్టు చేసిన నలుగురిని ఏళుమాత్తూరు కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్టు ఐజీ సెంథిల్‌కుమార్ వివరించారు.

మదురై టైడల్ పార్కు నిర్మాణానికి

సుప్రీం గ్రీన్ సిగ్నల్

● స్టే విధించేందుకు నిరాకరణ



చెన్నై, మే 19 (ఆంధ్రజ్యోతి): మదురైలో టైడల్ పార్కు నిర్మాణాలపై స్టే విధించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. నిర్మాణాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 9.56 ఎకరాల్లో టైడల్ పార్కు నిర్మాణానికి సిద్ధమైన రాష్ట్ర ప్రభుత్వం.. వండియూరు చెరువును ఆక్రమించుకుందని, నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన స్థల సేకరణపై జలవనరులు, పర్యావరణ పరిరక్షణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మయిల్‌స్వామి గతంలో హైకోర్టు మదురై బెంచ్‌ను ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు... మదురై కార్పొరేషన్‌కు సొంతమైన ఎరువుల గోదాము ఉన్న ప్రాంతంలో ప్రస్తుతం టైడల్ పార్కు నిర్మాణం చేపడుతున్నారని, ఈ రెండు ప్రజల సంక్షేమానికి సంబంధించినవని స్పష్టం చేస్తూ ఆ పిటిషన్‌ను తోసివుచ్చింది. అయితే హైకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ మయిల్‌స్వామి సుప్రీంకోర్టులో అప్పీలు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై సోమవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. స్థలం స్వాధీనం చేసుకొనే అధికారం రెవెన్యూ శాఖకు మాత్రమే ఉందని, కానీ కార్పొరేషన్ స్వాధీనం చేసుకుందని వివరించారు. అందువల్ల మదురై టైడల్ పార్కు నిర్మాణాలకు స్టే విధించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు ధర్మాసనం స్పందిస్తూ.. హైకోర్టు చాలా స్పష్టమైన తీర్పు వెలువరించిందన్నారు. 44 ఏళ్ల క్రితమే మదురై కార్పొరేషన్ ఆ స్థలం స్వాధీనం చేసుకుందని, అలాంటప్పుడు ఆ స్థలంలో చెరువు ఉందని ఎలా చెప్పగలరని నిలదీసింది. టైడల్ పార్కు నిర్మాణంపై స్టే విధించబోమని స్పష్టం చేస్తూ పిటిషన్‌ను కొట్టివేసింది.

సమాచార దర్శిని

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, మే 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్లలో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ బోర్డు తెలిపింది. **ఆవడి:** సీటీహెచ్ రోడ్డు, కవరపాళయం, సింధు నగర్, డీఆర్ఆర్ నగర్, ధనలక్ష్మి నగర్, ఎమ్మార్ఎఫ్ నగర్, నాజర్ మెయిన్ రోడ్డు, మోజస్ వీధి. **తిరుముల్లైవాయల్:** ఆర్ని అంథోని నగర్, పొత్తూర్ ఇండస్ట్రీస్.

నేడు విద్యుత్ గ్రీవెన్స్

పెరంబూర్, మే 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోరూర్‌లో మంగళవారం విద్యుత్ గ్రీవెన్స్ జరగనుంది. పోరూర్ - చెట్టియార్ అగరం రోడ్డు సమీపంలోని 110 కిలోవాట్ల ఎస్సార్ఎంసీ ఉప విద్యుత్ కేంద్ర ప్రాంగణంలోని నిర్వహణ ఇంజనీర్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు జరుగనున్న గ్రీవెన్స్‌లో, పోరూర్, పరిసర ప్రాంతాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు పాల్గొని విద్యుత్ సంబంధిత సమస్యలు తెలిపి పరిష్కారం పొందవచ్చని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

మదురైలో ల్యాండ్ అయిన తిరుచ్చి విమానాలు

పెరంబూర్, మే 19 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు, చెన్నై నుంచి తిరుచ్చికి రావాల్సిన విమానాలు భారీ వర్షం కారణంగా మదురైలో ల్యాండయ్యాయి. బెంగళూరు నుంచి ఆదివారం రాత్రి 7.20 గంటలకు 142 మంది ప్రయాణికులతో బయల్దేరిన విమానం 8.30 గంటలకు తిరుచ్చికి చేరింది. కానీ, ఆ సమయంలో భారీవర్షం కురుస్తుండడంతో ల్యాండింగ్‌కు వాతావరణం అనుకూలించక ఆ విమానాన్ని మదురైకి పంపారు. మదురై నుంచి రాత్రి 9.15 గంటలకు విమానం తిరుచ్చి బయల్దేరి వెళ్లింది. అలాగే, చెన్నై నుంచి రాత్రి 7.45 గంటల బయల్దేరిన విమానం 8.40 గంటలకు తిరుచ్చి చేరుకోగా, భారీ వర్షం కారణంగా మదురైకి పంపారు. కొద్దిసేపటి తర్వాత ఆ విమానం తిరుచ్చి బయల్దేరి వెళ్లింది.

90 శాతం అధిక వర్షపాతం

పెరంబూర్, మే 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈ ఏడాది సాధారణం కన్నా 90 శాతం అధిక వర్షపాతం నమోదైందని వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది. రాష్ట్రంలో మార్చి 1 నుంచి ఈ నెల 18వ తేది వరకు సాధారణ వర్షపాతం 10 సెం.మీ కాగా, 90 శాతం అధికంగా 19.2 సెం.మీ వర్షం కురిసింది. కళ్లకుర్చిలో సాధారణ వర్షపాతం 6 సెం.మీ కాగా, 28 సెం.మీ వర్షపాతం నమోదైంది. ఇక, చెన్నైలో మార్చి 1 నుంచి ఆదివారం వరకు 83 శాతం అధిక వర్షపాతం నమోదైందని వాతావరణ కేంద్రం తెలిపింది.

మేట్టూరు డ్యాంకు పెరిగిన ఇన్‌ఫ్లో

పెరంబూర్, మే 19 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లాలోని మెట్టూరు డ్యాంకు వస్తున్న నీటి పరిమాణం పెరిగింది. కావేరి నది పరివాహక ప్రాంతాల్లో కొద్దిరోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. మేట్టూరు డ్యాంకు ఆదివారం సెకనుకు 4,764 ఘనపుడుగులుగా వస్తున్న నీరు, సోమవారం 6,233 క్యూసెక్కులకు పెరిగింది. ప్రస్తుతం డ్యాంలో 108.52 అడుగులు (76.74 టీఎంసీలు) నీటినిల్వలుండగా, తాగునీటి అవరాలకు 1,000 ఘనపుటడుగులు విడుదల చేస్తున్నట్లు ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

రెండు లక్షలకు చేరువలో ఇంజనీరింగ్ దరఖాస్తులు

పెరంబూర్, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యా సంవత్సరం ఇంజనీరింగ్ కోర్సుల్లో అడ్మిషన్లు కోరుతూ విద్యార్థుల దరఖాస్తులు 2లక్షలకు చేరువయ్యాయి. రాష్ట్రంలో 450కిపైగా ఇంజనీరింగ్‌కళాశాల్లో 2.20 లక్షల సీట్లున్నాయి.వాటిభర్తీకి సంబంధించి దరఖాస్తు స్వీకరణ ఈనెల 9వతేది నుంచి ప్రారంభమైంది. స్వీకరణ ప్రారంభమైన తొలిరోజే 14,462మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆదివారం సాయంత్రానికి 1,86,835 మంది దరఖాస్తు చేసుకు న్నారు. వారిలో 1,18,491 మంది దరఖాస్తు రుసుము చెల్లించగా, 70,584 మంది సర్టిఫికేట్లు అప్‌లోడ్ చేశారని అన్నా వర్సిటీ పేర్కొంది.

కలైంజర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.6.23 కోట్ల ఆర్థిక సాయం

పెరంబూర్, మే 19 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు పేద విద్యార్థులకు విద్యా ఫీజు, వైద్యం తదితరాలకు రూ.6.23 కోట్ల ఆర్థికసాయం అందజేశారు. 2005లో అప్పటి ముఖ్యమంత్రి కరుణానిధి, కలైంజర్ ట్రస్ట్ స్థాపించి రూ.5 కోట్లు బ్యాంక్ ఖాతాలో జమచేశారు. ఆ నిధుల్లో రూ.కోటి దక్షిణ భారత పుస్తక విక్రయదారులు, ప్రచురణ కర్తల సంఘానికి , మిగిలిన రూ.4 కోట్లపై వచ్చే వడ్డీకి పేద విద్యార్థులు ఫీజు, వైద్య ఖర్చులకు అందజేయనున్నట్లు ప్రకటించారు. ఆ ప్రకారం, ప్రతినెలా వడ్డీ రూపంలో వచ్చే రూ.2 లక్షలను 8 మంది విద్యార్థులకు తలా రూ.25,000 చొప్పున అందజేస్తున్నారు. ఆ ప్రకారం, 2005 నుంచి ఈ నెల వరకు రూ.6,23,90,000 ఆర్థిక సాయం ట్రస్ట్ ద్వారా అందజేశారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, 8 మంది విద్యార్థులకు తలా రూ.25,000 అందజేశారు.

గుర్తింపు పార్టీలతో ఈసీ సమావేశం

అడయార్, మే 19 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ బూత్ ఫస్ట్‌గ్రేడ్ ఏజెంట్ల శిక్షణ శిబిరం ఈ నెల 22, 23 తేదీల్లో ఢిల్లీలో జరగనుంది. దీనిపై రాష్ట్రంలోని గుర్తింపు పొందిన పార్టీల ప్రతినిధులతో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి అర్చనా పట్నాయక్ సోమవారం కీలక సమావేశం నిర్వహించారు. ఇందులో డీఎంకే, అన్నాడీఎంకే, డీఎండీకే, సీపీఐ, నామ్ తమిళర్ కట్చి, వీసీకే, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్, సీపీఎం, బీజేపీ, బీఎస్పీ, ఆమ్ ఆద్మీ సహా మొత్తం 12 పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

10.5 శాతం రిజర్వేషన్ల కోసం ఆందోళన: పీఎంకే

అడయార్, మే 19 (ఆంధ్రజ్యోతి): వన్నియర్ సామాజిక వర్గ ప్రజలకు 10.5 శాతం రిజర్వేషన్ల కోసం రాష్ట్రం స్తంభించేలా ఆందోళన చేయనున్నట్టు పీఎంకే వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ రాందాస్ ప్రకటించారు. వన్నియర్ సంఘం నిర్వాహకులతో ఆయన సోమవారం దిండివనం సమీపంలోని తైలాపురం గార్డెన్‌లో సమావేశమయ్యారు. ఆ తర్వాత ఆయన విలేకరులతో మాట్లాడుతూ... వన్నియర్ వర్గానికి చెందిన ప్రజలకు 10.5 శాతం రిజర్వేషన్ కేటాయించాలని డిమాండ్ చేశామన్నారు. లేనిపక్షంలో రాష్ట్రం స్తంభించేలా ఆందోళన చేస్తామని రాందాస్ హెచ్చరించారు.

3 లక్షల ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి

● పోటీ పరీక్షల సంఘం డిమాండ్



నిరసన తెలుపుతున్న తమిళనాడు పోటీ పరీక్షల అభ్యర్థుల సంఘం నిర్వాహకులు

ప్యారీస్, మే 19 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ఎన్నికల హామీ ప్రకారం ప్రభుత్వ శాఖల్లో ఖాళీ అయిన 3 లక్షల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని పోటీ పరీక్షల సంఘం రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. స్థానిక ఎగ్మూర్ రాజరత్తినం స్టేడియం సమీపంలో పోటీ పరీక్షల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన నిరాహారదీక్షా శిబిరానికి సంఘ అధ్యక్షుడు ఖలీల్ బాషా, కార్యదర్శి తిరుకుమరన్ సారథ్యం వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... టీఎన్‌పీఎస్సీ నిర్వహించిన గ్రూప్-2ఏ పరీక్షల ఫలితాలు ఈనెల 17న విడుదలయ్యాయని, తమిళం, ఆంగ్ల భాషల్లో నిర్వహించిన ఈ పరీక్షల్లో ఆంగ్ల మీడియం అభ్యర్థులు 90 శాతం మంది, తమిళ మీడియం విద్యార్థులు 10శాతం మంది ఉత్తీర్ణుల వడం అనుమానాలకు తావిస్తోందన్నారు. దీనిపై టీఎన్‌పీఎస్సీ ఛైర్మన్‌ను సంప్రదించినా సరైన సమాధానం లేదన్నారు. 2021 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా డీఎంకే మేనిఫెస్టోలో ఐదేళ్లలో మూడు లక్షల ఖాళీ పోస్టులను భర్తీ చేస్తామని హామీ ఇచ్చిందని అయితే ఈ నాలుగేళ్లలో 30వేల పోస్టులు కూడా భర్తీ చేయలేదని వారు ఆరోపించారు. 12 రాష్ట్రాల్లో అమలులో ఉన్నట్లుగానే రాష్ట్రంలో కూడా గ్రూప్-1 పోస్టులకు వయోపరిమితిని 49 నుండి 51 వరకు పెంచాలని వారు డిమాండ్ చేశారు.

ఈడీ విచారణకు టాస్మాక్ డిప్యూటీ మేనేజర్

పెరంబూర్, మే 19 (ఆంధ్రజ్యోతి): ఈడీ విచారణకు టాస్మాక్ డిప్యూటీ మేనేజర్ సోమవారం హాజరయ్యారు. టాస్మాక్ మద్యం విక్రయాలు, కొనుగోళ్లలో అవినీతి జరిగిందని కేసు నమోదైంది. ఈ కేసు ఆధారంగా స్థానిక ఎగ్మూర్‌లోని టాస్మాక్ ప్రధాన కార్యాలయం, అధికారులు ఇళ్లు, మద్యం తయారీ కర్మాగారాలు అంటూ మొత్తం 20 ప్రాంతాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం (ఈడీ) అధికారులు గత మార్చి 6 నుంచి 8వ తేది వరకు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సుమారు రూ.1000 కోట్ల వరకు అవినీతి జరిగిందని ఈడీ ప్రకటించింది. ఈ నేపథ్యంలో, ఈడీ తనిఖీలు చట్టవిరుద్ధమని, విచారణకు స్టే విధించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం, టాస్మాక్ యాజమాన్యం తరఫున మద్రాసు హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లు విచారించిన హైకోర్టు, ఈడీ విచారణ సాగించవచ్చని ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఉత్తర్వులపై దాఖలైన అప్పీలు పిటిషన్ విచారించిన సుప్రీంకోర్టు, హైకోర్టు ఉత్వర్వులు సమర్థించింది. దీంతో, ఈడీ తన విచారణ ముమ్మరం చేసింది. శనివారం స్థానిక నుంగంబాక్కంలోని ఈడీ కార్యాలయంలో టాస్మాక్ మేనేజింగ్ డైరెక్టర్‌ను విచారించిన ఈడీ అధికారులు, సోమవారం టాస్మాక్ డిప్యూటీ మేనేజర్ జ్యోతి శంకర్‌ను విచారించారు.

విధుల నుంచి ప్రభుత్వ వైద్యుడి తొలగింపు

● రూ.40 లక్షల జరిమానా

పెరంబూర్, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రిలో చికిత్సలకు వచ్చిన మహిళను, తన సొంత క్లినిక్‌లో చికిత్సలు అందించిన ప్రభుత్వ వైద్యుడు ప్రభాకరన్‌కు రూ.40 లక్షల జరిమానా విధిస్తూ మానవ హక్కుల కమిషన్ తీర్పు వెలువరించింది. కోవిల్‌పట్టి సమీపం ఇళయసేంద్రానికి చెందిన సైనికుడు కరుప్పస్వామి భార్య జయ 2018లో కాలిన గాయాలతో కోవిల్‌పట్టి ప్రభుత్వాస్పత్రిలో చేరింది. ఆస్పత్రిలో వైద్యుడు ప్రభాకరన్ తాను సొంతంగా నిర్వహిస్తున్న క్లినిక్‌కు ఆ మహిళను తరలించి, చాలా రోజులు చికిత్సలు అందించారు. అయినా చికిత్సలు ఫలించక ఆమె మృతిచెందింది. ఈ వ్యవహారంపై మృతురాలి భర్త మానవ హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కేసు విచారించిన కమిషన్ సోమవారం తీర్పు వెలువరించింది. సైనికుడు కరుప్పస్వామికి రూ.50 లక్షల పరిహారాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందించాలని, రూ. 40 లక్షలను వైద్యుడు ప్రభాకర్ నుంచి, మరో వైద్యుడు వెంకటేశ్వరన్ నుంచి రూ.2 లక్షలు, ఉద్యోగులు కుమరేశ్వరి, గురులక్ష్మి నుంచి తలా రూ.లక్ష వసూలు చేయాలని, మిగిలిన రూ.6 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలని పేర్కొన్నారు. అలాగే, వైద్యుడు ప్రభాకరన్‌ను తొలగించాలని, మళ్లీ అతనిని ప్రభుత్వ విధుల్లో చేర్చరాదని, ఆయనపై ఛార్జిషీటు నమోదు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ వైద్యులు ప్రైవేటు ఆస్పత్రుల్లో పనిచేస్తున్నారా అనే విషయంపై నిఘా వేయాలని, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఫిర్యాదుల పెట్టెలు ఉంచాలని మానవ హక్కుల కమిషన్ తన తీర్పులో పేర్కొంది.

ప్లస్‌టూ విద్యార్థినికి కమల్ చేయూత

అడయార్, మే 19 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం పాంబన్ సమీపంలోని తెర్కువాడి జాలరి గ్రామానికి చెందిన విద్యార్థిని శోభన ప్లస్‌టూ పబ్లిక్ పరీక్షల్లో 562 మార్కులు సాధించింది. అయితే, ఈ విద్యార్థినికి ఉన్నత చదువులు చదువుకు నేందుకు తగినంత ఆర్థిక స్తోమత లేదని, దాతలు ఆదుకోవాలంటూ మీడియాలో వార్తలు వచ్చాయి. విషయం తెలుసుకున్న లోక నాయకుడు కమల్‌హాసన్ విద్యార్థినికి చేయూత నిచ్చేందుకు ముందుకు వచ్చారు. తన పార్టీకి చెందిన స్థానిక నేతల సాయంలో ఆ విద్యార్థినిని చెన్నైకు పిలిపించి తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆ విద్యార్థినిని అన్ని విధాలుగా సాయం చేస్తానని హామీ ఇవ్వడంతో పాటు విద్యార్థిని లక్ష్యాన్ని చేరుకునేంత వరకు అండగా ఉంటామని కమల్ హామీ ఇచ్చారు.

మా ఊరి చెరువు జోలికి రావొద్దు



తిరుత్తణి, మే 19 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు తాలూకాలోని పంద్రవేడు పంచాయతీలో దిండివనం - నగరి రైల్వే ప్రాజెక్ట్ కోసం అక్కడున్న చెరువును పూడ్చివేయడాన్ని నిరసిస్తూ గ్రామస్తులు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైల్వే ప్రాజెక్టు కోసం చెరువులను పూడ్చివేయడమేమిటని అధికారులను ప్రశ్నించారు. గ్రామస్తులకు మద్దతుగా సీపీఐ నాయకులు నిరసనలో పాల్గొన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్తులతో చర్చించారు. వారు నిరసన ఆపకపోవడంతో 17 మంది మహిళలను, 15 మంది సీపీఐ నాయకులను అరెస్టు చేశారు.

పళ్లిపట్టులో టీవీకే కార్యాలయం ప్రారంభం



తిరుత్తణి, మే 19 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు తాలూకాలోని ఐవీ పట్టడైలో తమిళగ వెట్రి కళగం కార్యాలయాన్ని ఆ ప్రాంత నేతలు ప్రారంభించారు. తిరువళ్లూరు పశ్చిమ జిల్లా ఇన్‌ఛార్జి స్టాలిన్ ముఖ్యఅతిథిగా పాల్గొని, నిర్వాహకులు సుబ్రమణి, కృష్ణన్, వేలును అభినందించారు. పళ్లిపట్టు కార్యదర్శి శశికుమార్, కంఠన్, వినాయగం, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుడి నిజాయితీ

● చెత్తలో దొరికిన 12 సవర్ల బంగారం చైన్ అప్పగింత


పోలీసుల సమక్షంలో యజమానికి చైన్ అప్పగిస్తున్న మణివేల్

పెరంబూర్, మే 19 (ఆంధ్రజ్యోతి): సేలంలో సేకరించిన చెత్తను వేరుచేస్తున్న సమయంలో దొరికిన 12 సవర్ల బంగారు నగను పోలీసుస్టేషన్‌లో అప్పగించిన పారిశుధ్య కార్మికుడిని పలువురు అభినందించారు. సేలం సూరమంగళం ప్రాంతానికి చెందిన మణివేల్ ఆదివారం ఉదయం రెడ్డిపట్టిలో చెత్త సేకరించే పనులను మణివేల్ చేపట్టాడు. సేకరించిన చెత్తను పొడి, తడి చెత్తగా విభజిస్తున్న సమయంలో బంగారు చైన్ కనిపించింది. మణివేల్ ఆ చైన్‌ను సూరమంగళం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఈ నేపథ్యంలో, రెడ్డిపట్టి అంబేడ్కర్ నగర్‌కు చెందిన ప్రమీల అనే వ్యక్తి బంగారు చైన్ కనిపించడం లేదంటూ అదే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తగిన విచారణ అనంతరం బంగారు చైన్‌ను మణివేల్ సమక్షంలో బంగారు చైన్‌ను ప్రమీలకు పోలీసులు అప్పగించారు. పేదరికంలో ఉన్నా పారిశుధ్య కార్మికుడి నిజాయితీని అభినందించారు.

రెండున్నరేళ్ల మనవడిపై స్పృహ తప్పి పడిన బామ్మ

● ఇద్దరూ మృతి

పెరంబూర్, మే 19 (ఆంధ్రజ్యోతి): స్పృహతప్పిన బామ్మ మనవడిపై పడిన ఘటనలో ఇద్దరూ మృతి చెందారు. నామక్కల్‌కు చెందిన అరుణ్‌కుమార్ చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఆయనకు భార్య గాయత్రి, రెండున్నరేళ్ల కుమారుడు సాయిక్రిష్ ఉన్నారు. చెన్నైలో ఉంటున్న అరుణ్‌కుమార్ దంపతులు, తమ కుమారుడిని నామక్కల్ ఈబీ కాలనీలో ఉన్న గాయత్రి తల్లి శాంతి ఇంట్లో ఉంచారు. ఆదివారం సెలవు రోజు కావడంతో అరుణ్, గాయత్రి నామక్కల్‌కు వెళ్లారు. మంచంపై శాంతి, ఆమె కింద కుమారుడు సాయిక్రిష్ పడి ఉండడం గమనించారు. వారిని వెంటనే ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడినుంచి నామక్కల్ ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రాథమిక విచారణలో... కొద్దికాలం క్రితం శాంతి గర్భ సంచి తొలగించిన ఆపరేషన్ చేయించుకుందని, అప్పటి నుంచి ఆమె అకస్మాత్తుగా స్పృహతప్పి పడిపోతుందని తెలిసింది.

గ్రామీణాభివృద్ధి పనులపై సమీక్ష


అధికారులకు దిశా నిర్దేశం చేస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులపై కలెక్టర్ సుబ్బులక్ష్మి సమీక్షించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన సమీక్షాసమావేశంలో పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.పనులు సత్వరం పూర్తిచేసేలా పర్యవేక్షించాలని ఈసందర్భంగా అధికారులను ఆదేశించారు. సమావేశంలో గ్రామీణాభివృద్ధి పథక డైరెక్టర్ సెంథిల్‌కుమార్, ఆశాఖ ఇంజనీర్ అరుళ్, అధికారులు పాల్గొన్నారు.

టాస్మాక్ మద్యం దుకాణం వద్దు



తిరుత్తణి, మే 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టాభిరామాపురం పంచాయతీలో ప్రారంభించనున్న టాస్మాక్ మద్యం దుకాణాన్ని మూసివేయాలంటూ ఆ మండల పీఎంకే నాయకులు సోమవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సమీపంలోని పట్టాభిరామాపురం పంచాయతీలో టాస్మాక్ దుకాణ ప్రారంభోత్సవానికి సన్నాహాలు చేయడంపై పోలీస్ స్టేషన్ ఎదుట పీఎంకే మండల అధ్యక్షుడు విజయన్ సారథ్యంలో నిరసనకు దిగారు. పోలీసులు పీఎంకే నాయకులతో మాట్లాడి అక్కడినుండి పంపివేశారు. అనంతరం ఆ ప్రాంత రెవెన్యూ అధికారి కార్యాలయానికి వెళ్ళి వినతిపత్రాన్ని సమర్పించారు.

తగ్గిన కూరగాయల ధరలు

పెరంబూర్, మే 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోయంబేడు మార్కెట్‌కు దిగుమతులు పెరగడంతో కూరగాయల ధరలు తగ్గాయి. కోయంబేడు మార్కెట్‌కు కర్ణాటక, ఆంధ్ర, కేరళ సహా పలు రాష్ట్రాల నుంచి ప్రతిరోజు 650 లారీల్లో 7 వేల టన్నుల కూరగాయలు దిగుమతి అవుతుంటాయి. సోమవారం ఉదయం 800 లారీల్లో 8,500 టన్నుల కూరగాయలు దిగుమతి కావడంతో వాటి ధరలు తగ్గాయి. ఆ ప్రకారం, కిలో ఉల్లి రూ.18, చిన్న ఉల్లి రూ.45, టమోటా రూ.10, బంగాళాదుంపలు రూ.20, క్యారట్ రూ.15, బీన్స్ రూ.50, బీట్‌రూట్ రూ.30, చౌచౌ రూ.10, ముల్లంగి రూ.12 సహా అన్ని కూరగాయల ధరలు తగ్గాయి.

పుదుచ్చేరి గవర్నర్ బంగ్లాకు బాంబు బెదిరింపు

పుదుచ్చేరి, మే 19 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి రాష్ట్ర లెఫ్టినెంట్ గవర్నర్ బంగ్లాకు వచ్చిన బాంబు బెదిరింపు కలకలం రేపింది. ఈ-మెయిల్ ద్వారా వచ్చిన బాంబు బెదిరింపు సమాచారాన్ని కార్యాలయ ఉద్యోగులు పోలీసులకు తెలియజేశారు. బాంబ్ స్క్వాడ్, పోలీసు జాగిలంతో అక్కడకు చేరుకున్న పోలీసులు, బంగ్లా, పరిసర ప్రాంతాలు క్షుణ్ణంగా తనిఖీచేసి ఎలాంటి పేలుడు పదార్థాలు లేవని నిర్ధారించారు. ఈ-మెయిల్ పంపిన చిరునామా కోసం దర్యాప్తు చేస్తున్నారు. కాగా, రెండు నెలల కాలంలో ఆరో సారి పుదుచ్చేరి గవర్నర్ కార్యాలయానికి ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపు రావడం గమనార్హం.

సకాలంలో పనులు పూర్తిచేయండి

● అధికారులకు కలెక్టర్ ఆదేశం


నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతాప్

తిరుత్తణి, మే 19 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా వేపంపట్టు, సెవ్వాపేటలో నిర్మిస్తున్న నూతన రైల్వే బ్రిడ్జి పనులను ఆదివారం సాయంత్రం కలెక్టర్ ప్రతాప్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లా పరిధిలోని వేపంపట్టులో గత నెల 24వ తేదీ బ్రిడ్జి పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. పనుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్లు దేవన్, చీఫ్ ఎడ్యుకేషన్ అధికారి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షల్లో జిల్లా ఫస్ట్

● విద్యార్థికి ఎమ్మెల్యే చంద్రన్ ప్రశంస


సుందరేశన్‌కు పుస్తకాన్ని బహూకరిస్తున్న ఎమ్మెల్యే చంద్రన్

తిరుత్తణి, మే 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన టెన్త్ పరీక్షల్లో జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన అత్తిమంజేరిపేటకి చెందిన సుందరేశన్‌ను ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే ఎస్.చంద్రన్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థుల ప్రతిభే వారిని ఉన్నతస్థాయికి తీసుకొస్తుందని, భవిష్యత్తులో కూడా ఇదే రీతిలో రాణించి, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. సుందరేశన్ తల్లిదండ్రులను, పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. అనంతరం వారికి కలైంజర్ పుస్తకాలను అందజేశారు.

సేలంలో లారీ బోల్తా

● ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం


భారీ క్రేన్ ద్వారా లారీని తొలగిస్తున్న కార్మికులు

టి.నగర్, మే 19 (ఆంధ్రజ్యోతి): సేలం నగరంలోని మామాంగంలో కొయ్యదిమ్మెల లోడుతో వెళుతున్న లారీ అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో సేలం - బెంగళూరు జాతీయ రహదారిలో రాకపోకలు స్తంభించాయి. సేలం పరిసర ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురువడంతో సేలం - బెంగళూరు జాతీయ రహదారిలో వర్షపు నీరు అడుగు ఎత్తున ప్రవహించింది. సోమవారం వేకువజాము ఆ రహదారిలో కొయ్యదిమ్మెల లోడుతో వచ్చిన లారీ గోతిలో ఇరుక్కుని అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ మాధు (45) ఎలాంటి గాయాలు కాకుండా బయటపడ్డాడు. ఈ ప్రమాదం కారణంగా సుమారు ఆరుకిలోమీటర్ల పొడవున ఇరువైపులా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అగ్నిమాపకదళం, పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని దిమ్మెలను, లారీని క్రేన్ సాయంతో తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

మహిళపై కానిస్టేబుల్ అత్యాచార యత్నం

పెరంబూర్, మే 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక పళవేర్కాడు సమీపంలోని జాలర్ల గ్రామంలో ఘర్షణల కారణంగా ఆ ప్రాంతంలో పోలీసు భద్రత ఏర్పాటుచేశారు. నడువర్ మాదాకుప్పం గ్రామంలో చేపలు పట్టే విషయంలో జాలర్ల మధ్య వివాదం ఏర్పడింది. దీంతో, ఇరువర్గాలుగా విడిపోయిన జాలర్లు పరస్పర ఘర్షణలకు పాల్పడుతున్నారు. జాలర్ల మధ్య సఖ్యత నెలకొల్పేలా ఆర్డీఓ, తహసీల్దార్, తిరుపాలైవనం పోలీసులు చర్చలు జరిపారు. చర్చల సమయంలో సఖ్యతగా ఉంటామని తెలిపిన జాలర్లు, అధికారులు వెళ్లిన వెంటనే మళ్లీ ఘర్షణలకు పాల్పడుతున్నారు. గ్రామంలో ఘర్షణలు అదుపుచేసేలా వారం నుంచి 30 మంది పోలీసులు 24 గంటలు భద్రతా విధులు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో, శనివారం రాత్రి ఆ గ్రామానికి చెందిన దినేష్, తన కుమార్తెతో కలసి ఇంటి ముందు నిద్రించాడు. అర్ధరాత్రి దినేష్ కుమార్తె టాయిలెట్ వెళ్లగా, గ్రామంలో భద్రతా విధుల్లో ఉన్న కానిస్టేబుల్ సుధాకర్ (24) ఇంట్లో ప్రవేశించి ఆమెపై అత్యాచారయత్నం చేశాడు. దీంతో ఆమె బిగ్గరగా కేకలు వేయడంతో సుధాకర్ ఇంట్లోకి వెళ్లి బీరువా వెనుక దాక్కున్నాడు. చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని సుధాకర్‌ను తిరుపాలైవనం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు, సుధాకర్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి, న్యాయమూర్తి ఉత్తర్వులతో రిమాండ్ నిమిత్తం పుళల్ జైలుకు తరలించారు.


న్యూయార్క్‌లోని ఆర్ఐటీ గౌరవ డాక్టరేట్ అందుకున్న వేలూరు వీఐటీ యూనివర్సిటీ ఛాన్సలర్ జి.విశ్వనాథన్‌ను అభినందిస్తున్న మాజీ కౌన్సిలర్, పారిశ్రామికవేత్త రిషికుమార్


వేలూరు శ్రీ నారాయణి విద్యాలయ మెట్రిక్ ఉన్నత పాఠశాలలో ప్లస్ టూ పరీక్షల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ఆశీస్సులు అందజేస్తున్న శక్తి అమ్మ (చిత్రంలో) శ్రీపురం స్వర్ణాలయ డైరెక్టర్, ట్రస్టీ, శ్రీ నారాయణి పాఠశాలల కరస్పాండెంట్ సురేష్‌బాబు, పాఠశాలల సలహాదారులు రమేష్ తదితరులు

నైరుతి రుతుపవనాల ముందస్తు చర్యలు

● అగ్నిమాపక సిబ్బంది మాక్ డ్రిల్



పెరంబూర్, మే 19 (ఆంధ్రజ్యోతి): వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించేలా అగ్నిమాపక సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నారు. నైరుతి రుతుపవనాలతో ఏర్పడే విపత్తులను ఎదుర్కొనేలా ప్రభుత్వం అన్నిరకాల ముందస్తు చర్యలు చేపడతోంది. కోయంబత్తూర్ జిల్లాలో ముంపుకు గురయ్యే ప్రాంతాలైన మేట్టుపాళయం, పొల్లాచ్చి తదితర ప్రాంతాల్లో ముందస్తు చర్యల్లో భాగంగా, వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించేలా అగ్నిమాపక సిబ్బంది సోమవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. పోరూర్ పెద్ద చెరువులో జరిగిన ఈ మాక్ డ్రిల్‌లో ఓ వ్యక్తి వరదల్లో చిక్కుకోవడం, అగ్నిమాపక సిబ్బంది ఈదుకుంటూ వెళ్లి అతన్నిరక్షించడం, దోనెలో తీరానికి తీసుకురావడం, స్పృహతప్పిన అతనికి ప్రథమ చికిత్సలు అందించడం తదితరాలు చేసి చూపించారు. అలాగే, అత్యవసర పరిస్థితుల్లో థర్మోకోల్, ఖాళీ వాటర్ క్యాన్‌లు వినియోగించి వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించడం తదితరాలు ప్రదర్శించారు.


వరదల్లో చిక్కుకున్న వ్యక్తిని రక్షించి తీరానికి తీసుకొస్తున్న దృశ్యాలు

చిత్రజ్యోతి

పెళ్లి పీటలెక్కనున్న సింగర్ విఘ్నేష్

తమిళం, తెలుగు, కన్నడ, మలయాళ చిత్రపరిశ్రమలో సినీ నేపథ్య గాయకుడిగా రాణిస్తున్న విఘ్నేష్ త్వరలోనే ఓ ఇంటివాడు కాబోతున్నారు. ప్రముఖ నృత్య కళాకారిణి శ్వేత ఆనంద్‌ను ఆయన వివాహం చేసుకోనున్నారు. వీరి పెళ్లి జూన్ 5న ఈసీఆర్‌లోని దక్షిణ చిత్ర కల్చరల్ సెంటర్‌లో జరగనుంది. విఘ్నేష్ కేవలం నేపథ్య గాయకుడిగానే కాకుండా, సంగీత దర్శకుడిగా, గేయ రచయితగా, రాక్ సింగర్‌గా ఇలా బహుముఖ ప్రజ్ఞాశాలిగా రాణిస్తున్నారు. తమిళ కళాకారుడు అయినప్పటికీ ఆయన మాత్రం తెలుగు సినిమాల్లోనే అధిక సంఖ్యలో పాటలు పాడటం గమనార్హం. హ్యారీస్ జయరాజ్, శ్రీకాంత్ దేవా, తమన్, శ్రీసత్య, శ్యామ్ సీఎస్, జస్టిన్ ప్రభాకర్ వంటి అనేక మంది సంగీత దర్శకులతో కలిసి పనిచేశారు. స్థానిక ట్రిప్లికేణికి చెందిన విఘ్నేష్ అలియాస్ విక్కీ... భరతనాట్య కళాకారిణి శ్వేత ఆనంద్‌తో కలిసి మూడుముళ్ళ బంధంలోకి అడుగుపెట్టనున్నారు. శ్వేత తల్లి పద్మినిఆనంద్ కూడా ఉత్తమ నృత్య కళాకారిణి కావడం గమనార్హం. శ్వేత ఆనంద్ కూడా కేవలం భరతనాట్య కళాకారిణిగానే కాకుండా, గాయనిగా, మృదంగ వాయ్యి కళాకారిణిగా, వయోలిన్ విద్వాంసురాలిగా ఇలా మల్టీ టాలెంటెడ్. కెనడాలోని ట్రెంట్ విశ్వవిద్యాలయం నుంచి సోషియాలజీలో డిగ్రీ పొందారు.



'వాడివాసల్' కోసం అంకితభావంతో పనిచేస్తా

● వెట్రిమారన్

'వాడివాసల్' చిత్ర నిర్మాణాన్ని అంకితభావంతో పూర్తి చేసేందుకు తన సమయాన్ని కేటాయిస్తానని దర్శకుడు వెట్రిమారన్ స్పష్టం చేశారు. ఐదేళ్ల క్రితం ప్రారంభించిన ఈ చిత్ర షూటింగ్ ఎన్నో అవాంతాలతో నిలిచిపోయింది. ప్రముఖ నిర్మాత కలైపులి ఎస్.థాను నిర్మించే ఈ చిత్రానికి జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం. ఈ



వెట్రిమారన్, సూర్య తదితరులు

ప్రాజెక్టు ప్రీప్రొడక్షన్ నిర్మాణ పనులు ప్రారంభించినప్పటికీ ఆ తర్వాత పక్కనబెట్టేశారు. అయితే, ఈ యేడాది షూటింగ్ ప్రారంభించాలన్న పట్టుదలతో దర్శకనిర్మాతలున్నారు. దీనిపై ఆ చిత్ర దర్శకుడు వెట్రిమారన్ మాట్లాడుతూ... 'వాడివాసల్' చిత్రంపై భారీ స్థాయిలో అంచనాలున్నాయి. ఈ సినిమా కోసం పూర్తి అంకితభావంతో పనిచేస్తా. తద్వారా సినీ ప్రేక్షకుల అంచనాలను నివృత్తి చేస్తా. అయితే, ఈ అంచనాలు చేరుకునేందుకు నేనే ఒక్కడినే కారణమని మాత్రం చెప్పను' అని దర్శకుడు వెట్రిమారన్ అన్నారు.

సెప్టెంబరులో 'ఎస్‌టీఆర్-51' షూటింగ్

శిలంబరసన్ హీరోగా నటించే 51వ చిత్రం షూటింగ్ సెప్టెంబరులో ప్రారంభమవుతుందని ఆ చిత్ర నిర్మాత అర్చన వెల్లడించారు. ఈ చిత్రానికి 'డ్రాగన్' ఫేం అశ్వత్ మారిముత్తు దర్శకత్వం హించనున్నారు. ప్రస్తుతం రామ్‌కుమార్ దర్శకత్వంలో శింబు సహా సంతానం, కయదు లోహర్ తదితరులు నటిస్తున్నారు. 'శింబు డేట్స్ లేకపోవడం వల్లే సినిమా ప్రారంభంలో జాప్యం జరిగింది అయితే, సెప్టెంబరులో షూటింగ్ మొదలవుతుంది. ఇది కచ్చితంగా శింబు అభిమానులతో పాటు సినీ ప్రేక్షకులకు కూడా మంచి అనుభూతిని కలిగించే చిత్రంగా నిలుస్తుంది' అని నిర్మాత అర్చన పేర్కొన్నారు.



శింబు, అశ్వత్ మారిముత్తు

24నుంచి కొడైకెనాల్‌లో 62వ పుష్ప ప్రదర్శన



పుష్ప ప్రదర్శనకు సిద్ధమవుతున్న పార్క్

పెరంబూర్, మే 19 (ఆంధ్రజ్యోతి): కొడైకెనాల్‌లో ఈనెల 24నుంచి 62వ పుష్ప ప్రదర్శన ప్రారంభం కానుంది. రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన వేసవి విడిది కేంద్రాల్లో ఒకటైన దిండుగల్ జిల్లా కొడైకెనాల్‌కు రాష్ట్రం సహా పొరుగు రాష్ట్రాలు, విదేశాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తుంటారు. ముఖ్యంగా, వేసవి ఎండల నుంచి సేదతీరేందుకు కుటుంబాలతో వస్తున్న పర్యాటకులతో కొడైకెనాల్ సందడిగా మారుతోంది. పర్యాటకులకు మరింత ఆహ్వానం అందించేలా ఉద్యాన, పర్యాటక శాఖలు వివిధ రకాల ప్రదర్శనలు ఏర్పాటు చేస్తుంటాయి. ఈ విషయమై దిండుగల్ జిల్లా కలెక్టర్ శరవణన్ ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో... ఈ నెల 24న ప్రారంభం కానున్న పుష్ప ప్రదర్శన జూన్ 1వ తేది వరకు 9 రోజులు జరుగుతుందన్నారు. పుష్ప ప్రదర్శనతో పాటు డాగ్ షో, పడవ పోటీలు, చేపలు పట్టే వేడుకలు సహా పలు కార్యక్రమాలు ఏర్పాటవుతున్నాయని తెలిపారు. బ్రయాంట్ పార్కులో ప్రారంభం కానున్న పుష్ప ప్రదర్శనలో సాల్వియా, డెల్ఫీనియం, జినియా, పింక్‌ఆస్టా, బెన్‌స్టీమన్ తదితర విదేశీ పూల రకాలు ప్రదర్శనలో ఉంటాయి.నెమలి, దిండుగల్ తాళం,కొండ వెల్లుల్లి సహా పలు నమూనాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటాయని కలెక్టర్ తెలిపారు.

వేదారణ్యంలో ఆగిన ఉప్పు ఉత్పత్తి



ఉప్పు మళ్లలో చేరిన నీరు

వాషర్‌మెన్‌పేట, మే 19 (ఆంధ్రజ్యోతి): వేదారణ్యం సముద్రతీర ప్రాంతాల్లో నాలుగవ రోజైన సోమవారం ఉప్పు ఉత్పత్తి స్తంభించింది. నాగపట్టినం జిల్లా వేదారణ్యం, పరిసర ప్రాంతాల్లో అధిక సంఖ్యలో ఉప్పు ఉత్పత్తి చేస్తుంటారు. శుక్రవారం నుంచి ఈ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వర్షపు నీరు ఉప్పు మళ్లలో చేరడంతో ఉత్పత్తి స్తంభించింది. సుమారు 7 వేల ఎకరాల్లో ఉత్పత్తి స్తంభించిందని, ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందుగానే ప్రవేశించడంతో ఉప్పు ఉత్పత్తి గణనీయంగా తగ్గే అవకాశముందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

ఊటీకి పోటెత్తిన పర్యాటకులు







పుష్ప ప్రదర్శన వీక్షిస్తున్న పర్యాటకులు

పెరంబూర్, మే 19 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా ఊటీ బొటానికల్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన 127వ పుష్ప ప్రదర్శన పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. నాల్గో రోజైన ఆదివారం బొటానికల్ గార్డెన్ పర్యాటకులతో కిటకిటలాడింది. ప్రదర్శన కోసం పార్కు ప్రవేశ ద్వారం వద్ద వివిధ రంగుల పూలతో ఐదుకు పైగా తోరణాలు ఏర్పాటుచేశారు. ప్రదర్శనలో పొన్నియన్ సెల్వన్ కోట, రాజభవన ప్రవేశ ద్వారం తదితరాలు సుమారు 7 లక్షల పూలతో రూపొదించారు. ఇవి చోళుల వైభవాన్ని చాటి చెబుతున్నాయి. అలాగే, రాజ సింహాసనం, ఊయల, ఏనుగు, హంస రథం, ఫిరంగి సహా పలు నమూనాలు రూపొందించారు. ఇక 35,000 కుండీలను పూలతో అలంకరించారు. ఈనెల 25వ తేది వరకు ఈ ప్రదర్శన జరగనుంది. పూలతో రూపొందించిన ఆకృతుల ముందు పిల్లలు, పెద్దలు సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. ప్రదర్శన ప్రారంభమైన తొలిరోజు 14,000 మంది, రెండో రోజు 16,580 మంది. మూడో రోజు 25,000 మంది పుష్ప ప్రదర్శన వీక్షించారని అధికారులు తెలిపారు.

క్యూఆర్ కోడ్‌తో ప్రభుత్వ పాఠశాల అడ్మిషన్లు



గ్రామంలో ఏర్పాటు చేసిన పోస్టర్

పెరంబూర్, మే 19 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం యూనియన్ తిరుప్పుతుళి పంచాయతీ యూనియన్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల అడ్మిషన్లు క్యూఆర్ కోడ్ ద్వారా చేపట్టారు. ఈ మేరకు గ్రామంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినైల్ పోస్టర్లలో 'విద్యార్థుల చేరికకు ఆహ్వానం... ఇంట్లోనే ఉంటూ మీ పిల్లలను మన తిరుప్పుతుళి పంచాయతీ యూనియన్ ప్రాథమిక పాఠశాలలో చేర్పించండి... అందుకు క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేయండి, మన స్కూల్లో చేరండి....' అంటూ ముద్రించారు. కాగా, ఈ పోస్టర్లు పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ తన ఎక్స్‌పేజీలో 'సూపర్' అంటూ అభినందించారు.

కారులోనే పుదుచ్చేరి సీఎం భోజనం



కారులో భోజనం చేస్తున్న సీఎం రంగస్వామి

పుదుచ్చేరి, మే 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర పాలిత రాష్ట్రం పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్. రంగస్వామి హంగులు, ఆర్భాటాలు లేని సాధారణ ముఖ్యమంత్రిగా పేరుగాంచారు. ఎలాంటి అనుమతులు లేకుండా ప్రజలు ఆయన్ను ఏ క్షణంలోనైనా కలుసుకోవచ్చు. అలాగే, ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా తన కారుకు ముందు భద్రతా వాహనాలు వెళ్లరాదని ఆయన ఆజ్ఞలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో, ఆదివారం పుదుచ్చేరి కదిర్‌గామం నియోజకవర్గంలో రూ.2 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి రంగస్వామి ప్రారంభించారు. అనంతరం షణ్ముగపురం ఆడిటోరియం సమీపం వాలీబాల్ కోర్టు భూమి పూజకు సీఎం బయల్దేరారు. ఆదివారం కావడంతో పర్యాటకుల రద్దీ అధికంగా ఉండడంతో ట్రాఫిక్ రద్దీలో సీఎం వాహనం చిక్కుకుంది. దీంతో, సీఎం వాహనం వెళ్లేందుకు ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు. అందుకు వారిని వారించిన సీఎం, తన కారును రోడ్డు పక్కగా నిలపమని డ్రైవర్‌కు సూచించి, ట్రాఫిక్ నియంత్రించాలని పోలీసులను ఆదేశించారు. అప్పటికే మధ్యాహ్న భోజనం సమయం కావడంతో, సీఎం తన కారులోనే భోజనం పూర్తిచేశారు.

వాణిజ్య పన్నుల శాఖకు 23 కొత్త వాహనాలు

● ప్రారంభించిన మంత్రి మూర్తి

ప్యారీస్, మే 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ వాణిజ్య పన్నుల శాఖ ఆధ్వర్యంలో 23 కొత్త వాహనాలను ఆ శాఖ మంత్రి మూర్తి ప్రారంభించారు. సోమవారం ఉదయం స్థానిక నందనంలోని వాణిజ్య పన్నులు, రిజిస్ట్రేషన్ శాఖల కార్యాలయ ప్రాంగణంలో 2025వ సంవత్సరం ఏప్రిల్ నెలకు సంబంధించిన జాయింట్ కమిషనర్ల పనితీరుపై సమీక్షా సమావేశం జరిగింది. ముందుగా రూ.2.02 కోట్లతో కొత్తగా వాణిజ్య పన్నుల శాఖలో పని చేస్తున్న అధికారుల కోసం కొనుగోలు చేసిన 23 వాహనాలను మంత్రి మూర్తి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 2024 ఆర్థిక సంవత్సరంలో పన్నుల రూపంలో ఆదాయం పెరిగేందుకు జాయింట్ కమిషనర్లు, అన్ని ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు చేసిన కృషి అపారమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య పన్నులశాఖ కమిషనర్ ప్రొఫెసర్ జగన్నాథన్, జాయింట్ కమిషనర్ పూంగొడి తదితరులు పాల్గొన్నారు.



కొత్త వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి మూర్తి

విద్యుత్ ఛార్జీల పెంపు నిర్ణయం సరికాదు



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్



సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్

● బీజేపీ, సీపీఐ

ప్యారీస్, మే 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఛార్జీల పెంపు నిర్ణయాన్ని విరమించుకోవాలని బీజేపీ, సీపీఐలు రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. ఈ అంశంపై సోమవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్ వేర్వేరుగా ప్రకటన విడుదల చేశారు. డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి విద్యుత్ ఛార్జీలను పెంచుతుండటం వల్ల వ్యాపారులు, పరిశ్రమలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు. ప్రజలపై మరింత ఆర్థిక భారం పెరిగిందని నయినార్ నాగేంద్రన్ విమర్శించారు. ఇప్పటికే అన్ని రకాల పన్నుల పెంపుతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మళ్లీ విద్యుత్ ఛార్జీలు పెంచేందుకు తమిళనాడు విద్యుత్ బోర్డు (టీఎన్‌ఈబీ) నిర్ణయించిందని, దాన్ని వెనక్కు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా విద్యుత్ ఛార్జీల పెంపు నిర్ణయం సరికాదని అద్దె ఇళ్లలో ఉండే పేదప్రజలు ఆర్థికపరంగా మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొంటారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్ తన ప్రకటన ద్వారా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

టీఎన్‌ఈబీ నిర్ణయం...

జూలై నుంచి విద్యుత్ ఛార్జీలు పెంచే అంశాన్ని విద్యుత్ బోర్డు పరిశీలిస్తున్నట్లు సమాచారం. గృహాలు, వాణిజ్య సముదాయాలు, కర్మాగారాలు అని మూడు విభాగాల్లో సుమారు 3 కోట్లకు పైగా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఆ కనెక్షన్లకు తమిళనాడు విద్యుత్ క్రమబద్ధీకరణ కమిషన్ నిర్ణయించిన ఛార్జీలను వసూలు చేస్తుంటారు.ఈ నేపథ్యంలో, రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీలు 3 శాతం పెంచేలా విద్యుత్ బోర్డుకు విద్యుత్ క్రమబద్ధీకరణ కమిషన్‌కు సిఫారసు చేసింది. 2023 జూలైలో 2.18 శాతం విద్యుత్ ఛార్జీలు పెంచారు. అలాగే, వాణిజ్య కనెక్షన్లకు 2024 జూలైలో 4.8 శాతం ఛార్జీలు పెంచారు. కమిషన్ సిఫారసులపై సీఎందే తుది నిర్ణయమని విద్యుత్ బోర్డు అధికారులు చెప్పారు.

అంతర్జాతీయ కర్రసాము పోటీల్లో తెలుగమ్మాయి ప్రతిభ

● స్వర్ణ పతకం సాధించిన ఉసురుపాటి జననీశాంత



జననీశాంతకు స్వర్ణ పతకం అందజేస్తున్న నిర్వాహకులు

ప్యారీస్, మే 19 (ఆంధ్రజ్యోతి):నేపాల్ అంతర్జాతీయ కర్రసాము పోటీల్లో స్థానిక ట్రిప్లికేన్ స్వతంత్ర నగర్‌కు చెందిన 8ఏళ్ళ చిన్నారి ఉసురుపాటి జననీశాంత స్వర్ణ పతకం సాధించింది. ఖట్మండులో ఈ నెల14వ తేది నుంచి 19 వరకు నిర్వహించిన నేపాల్ అంతర్జాతీయ కర్రసాము పోటీల్లో పలు దేశాలకు చెందిన జూనియర్, సీనియర్ కేటగిరి క్రీడాకారులు పాల్గొన్నారు. జూనియర్ కేటగిరిలో పాల్గొన్న ఉసురుపాటి జననీశాంత శతృవుల నుంచి తప్పించుకునేలా వేదికపై కర్రను పలువైపులా వేగంగా తిప్పి సత్తా చాటింది. కర్రసాము పోటీ నిర్వాహకులు చిన్నారికి స్వర్ణ పతకం బహూకరించి అభినందించారు. ట్రిప్లికేన్ స్వతంత్రనగర్‌లో నివసిస్తున్న ఉసురుపాటి లోకేష్ కుమార్తె జనని రాయపేటలోని ఎస్‌ఎస్‌హెచ్ మెట్రిక్యులేషన్ పాఠశాలలో 4వ తరగతి చదువుతోంది. కర్రసాముపై కోచ్ కె.ఆనంద్ వద్ద శిక్షణ పొంది, ఆ క్రీడలో మెలకువలు నేర్చుకుని నేడు స్వర్ణ పతకం సొంతం చేసుకుని పలువురి ప్రశంసలందుకుంది.

ప్రభుత్వ ఉద్యోగులకు రూ.కోటి ఉచిత బీమా

● సీఎం నేతృత్వంలో 7 బ్యాంకులతో అవగాహన ఒప్పందం

ప్యారీస్, మే 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమార్థం ప్రభుత్వం పలు రాయితీలు కల్పించడంతో పాటు, ప్రమాదంలో మరణించినా, అవయవాలు కోల్పోయిన వారి కుటుంబాలకు రూ.కోటి అందేలా ఉచిత బీమా పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందుకోసం సోమవారం ఉదయం సీఎం స్టాలిన్ సమక్షంలో సచివాలయం ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వం ఏడు బ్యాంకులతో అవగాహన కుదుర్చుకుంది. ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు చేరుస్తున్న ఉద్యోగుల సంక్షేమంపై దృష్టిసారించిన ముఖ్యమంత్రి స్టాలిన్ ఆర్జితసెలవు రోజుల భత్యాన్ని ఈ ఏడాది నుండి పెంచడంతో పాటు, ఈ ఉద్యోగుల సంక్షేమం కోసం పలు రాయితీలను కూడా ప్రభుత్వం తరుపున కల్పిస్తున్నారు. సంపన్న దేశాల్లో లాగే ప్రభుత్వ ఉద్యోగులకు ఉచిత బీమా పథకాన్ని వర్తింపజేయనున్నట్లు ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశంలో సీఎం ప్రకటించారు. ఈ పథకం కోసం ఆర్థికశాఖ మంత్రి దాఖలు చేసిన ఆర్థిక బడ్జెట్‌లో, ప్రభుత్వ ఉద్యోగులు హఠాత్తుగా ప్రమాదాల్లో మరణించినా, అవయవాలు కోల్పోయినా రూ.కోటి నిధులు అందజేయనున్నట్లు ప్రకటించారు. ఈ పథకం కోసం ఎస్‌బీఐ, ఐఓబీ, కెనరా బ్యాంక్, యాక్సెస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంక్‌ల ఉన్నతాధికారులు సోమవారం ముఖ్యమంత్రి స్టాలిన్ సమక్షంలో జరిగిన కార్యక్రమంలో సంతకాలు చేసిన ఒప్పందపత్రాలను మార్చుకున్నారు. ఈ రాయితీ మాత్రమే కాకుండా బ్యాంకు రుణం, హౌసింగ్ లోన్, ఎడ్యుకేషన్ లోన్ తదితరాలను ప్రభుత్వ ఉద్యోగులు పొందే సమయంలో తక్కువ వడ్డీని వసూలు చేసేలా బ్యాంకులు ముందుకొచ్చాయి. ఈ కార్యక్రమంలో ఆర్థికశాఖ మంత్రి తంగం తెన్నరసు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, ఆర్థికశాఖప్రిన్సిపల్ సెక్రటరీ ఉదయచంద్రన్, కార్యదర్శి ఎస్.నాగరాజన్, అకౌంట్స్ ట్రెజరీశాఖ డైరెక్టర్ సావిత్రి, బ్యాంకుల ఉన్నత అధికారులు పాల్గొన్నారు.



సీఎం స్టాలిన్ సమక్షంలో అవగాహన ఒప్పందపత్రాలు మార్చుకుంటున్న అధికారులు

రాజపాళయంలో వీకేసీ కొత్త షోరూం



స్టోర్‌ను ప్రారంభిస్తున్న కన్నన్ కుటుంబీకులు

చెన్నై, మే 19 (ఆంధ్రజ్యోతి): వీకేసీ సంస్థ తన బహుళ ఈబీవో బ్రాండ్ల ద్వారా తన ప్రత్యేకమైన అవుట్‌లెట్లను విస్తరిస్తోంది. తాజాగా విరుదునగర్ జిల్లా రాజపాళయంలో 17వ షై వీకేసీ స్టోర్‌ను ప్రారంభించింది. యజమాని కన్నన్ ఇటీవల దీన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజపాళయంలో తమ మొదటి షై వీకేసీ స్టోర్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఇది తమిళనాడులో 17వ స్టోర్ అని చెప్పారు. ప్రపంచ ఫ్యాషన్‌కు అనుగుణంగా రూపొందించిన పాదరక్షలను విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు.

తిరుత్తణి రహదారిలో అదనపు భద్రతా ఏర్పాట్లు

● మున్సిపల్ కమిషనర్ కనిమొళి పరిశీలన

తిరుత్తణి, మే 19 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి జాతీయ రహదారిపై అధికారులు అదనపు భద్రతా ఏర్పాట్లు చేపట్టనున్నారు. కొన్ని నెలలుగా ఆ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాల వల్ల అక్కడి రోడ్డు మరమ్మతులకు గురైన ప్రాంతాల్లో చేపట్టిన పనులను సోమవారం ఉదయం తిరుత్తణి మున్సిపల్ కమిషనర్ కనిమొళి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆ ప్రాంతంలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రమాదాలను అరికట్టేందుకు తగు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. హైవేపై లైట్లు, రోడ్డు మరమ్మతులు, డివైడర్ల ఏర్పాటు తదితరాలను చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ కందన్, ఆర్ఐ గణేష్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ కనిమొళి

బింగ్‌హామ్టన్ వర్శిటీతో వీఐటీ మారిషస్ ఒప్పందం

చెన్నై, మే 19 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని బింగ్‌హామ్టన్ విశ్వవిద్యాలయంతో వీఐటీ మారిషస్ ఒప్పందం కుదుర్చుకుంది. విద్యార్థుల పరివర్తన, ఖండాంతర అవకాశాలను అందించడం కోసం ఈ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. వీఐటీ ఛాన్సలర్ డాక్టర్ జి.విశ్వనాథన్, బింగ్‌హామ్టన్ వర్శిటీ అధ్యక్షుడు డాక్టర్ హార్వే జి.స్టెంజర్ ఈ ఒప్పందంపై సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో నోబుల్ అవార్డు గ్రహీత డాక్టర్ ఎం.స్టాన్లీ విట్టింగ్‌హాం కూడా పాల్గొనడం విశేషం. ఈ సందర్భంగా డాక్టర్ విశ్వనాథన్ మాట్లాడుతూ.. ఈ వ్యూహాత్మక ఒప్పందం రెండు సంస్థల మధ్య దీర్ఘకాలిక సహకారానికి నాందీ పలికిందని, అమెరికాలోని ప్రముఖ సంస్థల్లో ఒకటైన ఈ వర్శిటీలో విద్యావకాశాలను అన్వేషించడానికి మార్గం సుగమమవుతుందన్నారు. వీఐటీ మారిషస్ అక్కడి ప్రభుత్వ ఉన్నత విద్యా కమిషన్‌చే ఆమోదించబడింది. కంప్యూటర్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో కంప్యూటర్ ఇంజనీరింగ్, డేటా సైన్స్‌తో కంప్యూటర్ ఇంజనీరింగ్‌లో బ్యాచిలర్స్ ఆఫ్ ఇంజనీరింగ్‌ను అందిస్తోంది. దీని తరగతులు జూలైలో ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు.



ఒప్పంద కార్యక్రమంలో ఇరువర్గాల నిర్వాహకులు



విద్యార్థులను తనిఖీ చేసి లోనికి పంపుతున్న సిబ్బంది

ఏపీఈఏపీ సెట్ ప్రారంభం

● హాజరైన 2,277 మంది విద్యార్థులు

ఇంజినీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న ఏపీ ఈఏపీ సెట్-2025 ప్రవేశ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల ప్రవేశానికి సంబంధించిన పరీక్షలు తిరుపతిలో 5, గూడూరు 4, పుత్తూరులో 2 మొత్తం 11 కేంద్రాల్లో నిర్వహించారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో నిర్వహించిన ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 2,458 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 2,277 మంది రాశారు. 181 మంది గైర్హాజరయ్యారు. మంగళవారం కూడా అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల ప్రవేశాలకు పరీక్ష నిర్వహిస్తారు. 21 నుంచి 27వ తేదీ వరకు ఇంజినీరింగ్ కోర్సుల ప్రవేశాలకు పరీక్షలు జరుగుతాయి.

- తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి

షార్‌లో ప్రారంభమైన యువికా

ఇస్రో నిర్వహించే యువికా-2025 (యువ విజ్ఞాన కార్యక్రమం) శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్ర షార్‌లో సోమవారం ప్రారంభమైంది. దేశవ్యాప్తంగా అన్ని ఇస్రో సెంటర్లలో ఈనెల 30 వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. యువికాకు ఎంపికైన 50మంది విద్యార్థులు షార్‌కు విచ్చేశారు. వీరికి ఇస్రో చేపట్టే రాకెట్ ప్రయోగాలు, ఉపగ్రహాల రూపకల్పన, అంతరిక్ష పరిశోధనలపై శిక్షణ తరగతులు నిర్వహించి అవగాహన కల్పిస్తారు. రాకెట్ ప్రయోగ వేదిక, స్పేస్ మ్యూజియాన్ని సందర్శించే అవకాశం కల్పిస్తారు. వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి సర్టిఫికెట్లు అందజేస్తారు.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 4 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.49 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 84,571

తలనీలాలు సమర్పించినవారు: 33,372





ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

వర్షంలోనూ తరలివచ్చారు

● పీజీఆర్ఎస్‌కు 257 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), మే 19(ఆంధ్రజ్యోతి): వర్షాన్ని సైతం లెక్కచేయకుండా మారుమూల ప్రాంతాల నుంచి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌కు తరలివచ్చారు. సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 257 అర్జీలు అందగా అందులో 155 రెవెన్యూ శాఖకు చెందినవే. అర్జీలపై ప్రత్యేక దృష్టిపెట్టి పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు.

పంటలను ఏనుగులు ధ్వంసం చేస్తున్నాయి



రేణిగుంట మండలం మామండూరులో ఏనుగుల దాడులు ఎక్కువయ్యాయి. పంట పొలాలపై దాడులు చేస్తుండడంతో తీవ్రంగా నష్టపోతున్నాం. అటవీ శాఖ ఏర్పాటు చేసిన కందకాలు పూడిపోవడంతో మామిడి తోటల్లోకి వచ్చి ధ్వంసం చేస్తున్నాయి. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి.

- చిట్టెమ్మ, మామండూరు, రేణిగుంట మండలం

జేమ్స్‌పై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

దళిత విద్యార్థి జేమ్స్‌పై దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జయచంద్ర, ఐద్వా జిల్లా కార్యదర్శి సాయిలక్ష్మి, సుమన్, వెంకటేష్ కోరారు. ఈ మేరకు అధికారులకు విన్నవించారు.

పనిచేయని లిఫ్టు :వారం రోజులుగా కలెక్టరేట్‌లో లిఫ్టు మొరాయిస్తూనే ఉంది. దీంతో అటు అర్జీదారులు, ఇటు ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లిఫ్టు పనిచేయకపోవడంతో సోమవారం పీజీఆర్ఎస్‌కు వచ్చిన వృద్ధులు, ప్రత్యేక ప్రతిభావంతులు అవస్థలు పడ్డారు.

రుయాలో చిన్నారికి అరుదైన శస్త్ర చికిత్స

తిరుపతి(వైద్యం), మే 19 (ఆంధ్రజ్యోతి): పుట్టుకతో మలబద్ధకంతో బాధపడుతున్న రెండేళ్ల చిన్నారికి అరుదైన శస్త్రచికిత్స చేసి పరిష్కరించామని రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రాధ సోమవారం మీడియాకు తెలిపారు. కర్నూలు జిల్లా ఒలిచాడుకు చెందిన శ్రావణి, గిరిరాజుల కుమార్తెకు ఎనీమ ఇస్తే తప్ప మలవిసర్జనకు వెళ్లలేని పరిస్థితిలో పలు ఆస్పత్రుల్లో చూపించినా ఫలితం లేకపోయిందన్నారు. ఇటీవల రుయాస్పత్రికి తీసుకురాగా చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ మనోహర్, చిన్నపిల్లల వైద్య నిపుణుడు జగదీష్ పరీక్షించి పెద్దపేగు నాడీ వ్యవస్థకు సంబంధించి లాంగ్ సెగ్మెంట్ హిర్ష్‌పురంగ్ వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించారన్నారు. మూడు దశల్లో క్లిష్టమైన శస్త్రచికిత్స నిర్వహించి సమస్యను పరిష్కరించారన్నారు. సోమవారం చిన్నారిని డిశ్చార్జి చేశామన్నారు. ఈ వైద్య బృందాన్ని ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రవిప్రభు, సూపరింటెండెంట్ రాధ అభినందించారు. ఏఆర్ఎంవో హరికృష్ణ, డాక్టరు శ్వేత తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడికి సిందూర్‌తో సమాధానం

● త్రిపుర మాజీ సీఎం బిప్లవ్ కుమార్‌దేవ్



సమావేశంలో మాట్లాడుతున్న బిప్లవ్ కుమార్‌దేవ్

తిరుపతి(ఉపాధ్యాయనగర్), మే 19(ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడికి బదులుగా చేపట్టిన ఆపరేష్ సిందూర్ పాకిస్థాన్‌కు గట్టి హెచ్చరిక అని త్రిపుర మాజీ ముఖ్యమంత్రి, ఎంపీ బిప్లవ్ కుమార్‌దేవ్ పేర్కొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ అధ్యక్షతన నగరంలో సోమవారం జరిగిన ఆపరేషన్ సిందూర్ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. ముందుగా అమరవీరుడు మురళీనాయక్‌కు నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. సిందూర్ ద్వారా మన సైనిక బలాన్ని ప్రపంచానికి చూపించామన్నారు. చైనా రాడార్ వ్యవస్థకూ అంతుచిక్కకుండా పాక్‌పై దాడులు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, చిత్తూరు జిల్లా ఇంచార్జి రాటకొండ విశ్వనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వరప్రసాద్, పెనుబాల చంద్రశేఖర్, డాక్టర్ నరేష్, మల్లకుప్ప శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రోగుల కోసం 'స్విమ్స్ సేవ'



స్విమ్స్ సేవ సహాయకులతో కరచాలనం చేస్తున్న డైరెక్టర్ ఆర్వీకుమార్

తిరుపతి(వైద్యం), మే 19(ఆంధ్రజ్యోతి): టీటీడీలో శ్రీవారి సేవ మాదిరిగా.. రోగుల సహాయం కోసం స్విమ్స్ సేవను సోమవారం ప్రారంభించినట్లు డైరెక్టర్ ఆర్వీకుమార్ తెలిపారు. ఎక్స్‌పర్ట్ కమిటీ నివేదిక ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. టీటీడీ చైర్మన్, ఈవో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 42 విభాగాల పరిధిలో రోజుకు 20 మంది చొప్పున స్విమ్స్ విద్యార్థులను బ్యాచ్‌ల వారీగా ఈ సేవకు నియమించామన్నారు. ఓపీ సమయంలో వీరు రోగులకు సాయం చేస్తారన్నారు. ప్రారంభ కార్యక్రమంలో ఎంఎస్ డాక్టర్ రామ్, ఫిజియో థెరపీ కళాశాల ప్రిన్సిపల్ మాధవి, వైద్యాధికారులు వివేకానంద్, మురళీ, శిరీష తదితరులు పాల్గొన్నారు.

సార్.. ఆదుకోండి

● పక్షవాతంతో బాధపడుతున్న కానిస్టేబుల్ వేడుకోలు
● మానవత్వం చూపిన ఎస్పీ
● పోలీస్ పీజీఆర్ఎస్‌కు 67 వినతులు



పక్షవాతంతో బాధ పడుతున్న రిజర్వు కానిస్టేబుల్

తిరుపతి(నేరవిభాగం), మే 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రిజర్వు విభాగంలోని కానిస్టేబుల్ శివకుమార్ కొన్నేళ్లుగా పక్షవాతంతో బాధ పడుతున్నారు. నడవలేక.. సరిగా మాట్లాడలేక.. నిలబడలేక ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో తనను ఆదుకోవాలని కోరుతూ సోమవారం కుమారుడు, భార్యతో కలసి ఎస్పీ కార్యాలయానికి వచ్చారాయన. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వినతిపత్రం ఇచ్చారు. ఆయన బాధ, విధులు నిర్వహించడానికి పడుతున్న కష్టాలను ఎస్పీకి వివరించారు. దాదాపు అరగంట పాటు ఆయనతో హర్షవర్ధన్‌రాజు మాట్లాడి బాధలు తెలుసుకున్నారు. పరిపాలనాధికారిని పిలిపించి తక్షణం ఆయనకు అవసరమైన ఆర్థిక సాయం, ఇతర ప్రయోజనాలు అందించాలని ఆదేశించారు. అనారోగ్యంతో బాధ పడుతున్న తనపట్ల ఎస్పీ చూపిన ఆదరణకు రిజర్వు కానిస్టేబుల్ శివకుమార్ కుటుంబీకులు ఆనందం వ్యక్తం చేశారు.

కేవీబీపురం ఘటనపై విచారణకు ఆదేశం

ఇటీవల కేవీబీపురంలో చోటు చేసుకున్న ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. కొందరు స్థానిక నాయకుల ప్రమేయంతో పోలీసులు బాధితులపైనే కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపారని బాధిత మహిళలు కొందరు ఎస్పీని కలిసి వివరించారు. దీనిపై విచారించి సమగ్ర నివేదిక అందచేయాలని పుత్తూరు డీఎస్పీ రవికుమార్‌ను ఎస్పీ ఆదేశించారు.

సమస్యల పరిష్కారంలో జవాబుదారీతనం ఉండాలి

పోలీసు పీజీఆర్ఎస్‌కు వచ్చిన 67 ఫిర్యాదులను పరిశీలించిన పోలీసు అధికారులు కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ సమస్యలు పరిష్కారంలో పోలీసు అధికారులు జవాబుదారీతనంగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు నాగభూషణరావు, రవిమనోహరాచ్చారి, సీఐలు సాదిక్ ఆలీ, జయచంద్ర, కేవీఎస్ నాయుడు, ఇమ్రాన్‌భాషా, జయచంద్ర, శ్రీరాములు, రామయ్య, తిమ్మయ్య, బాబీ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. కాగా, కొందరు కానిస్టేబుళ్లు తమకున్న ఇబ్బందులు చెప్పి అనుకూల ప్రాంతానికి బదిలీ చేసి ఆదుకోవాలనే విజ్ఞప్తిపై ఎస్పీ సానుకూలంగా స్పందించారు.

గిరిజన బాలుడి అదృశ్యం

● యజమానిపై తల్లి ఫిర్యాదు



వెంకటేష్ (ఫైల్ ఫొటో)

సత్యవేడు, మే 19 (ఆంధ్రజ్యోతి): అప్పు తీర్చేవరకు కుమారుడిని బాతులు మేపేందుకు వదిలిపెట్టి వెళ్లారా గిరిజన మహిళ. ఇప్పుడొచ్చి అడిగితే యజమాని నుంచి సరైన సమాధానం రాలేదు. బాలుడు కనిపించకుండా పోయాడని, వెతుకుతున్నామంటూ చెబుతున్నాడు. దీంతో ఆ తల్లి సత్యవేడు పోలీసులను ఆశ్రయించారు. పుత్తూరు డీఎస్పీ రవికుమార్ కథనం మేరకు.. గూడూరు మండలం చవటపాళేనికి చెందిన అంకమ్మ తన భర్త చెంచయ్యను వదిలేశారు. అదే గ్రామానికి చెందిన ప్రకాష్‌తో కలిసి తన ముగ్గురు పిల్లలను తీసుకుని సత్యవేడు పట్టణంలోని దళవాయి అగ్రహారానికి చెందిన ముత్తు వద్ద బాతులు మేపుతూ రెండేళ్లుగా జీవనం గడుపుతున్నారు. పది నెలల కిందట తన భర్త చెంచయ్య మృతి చెందడంతో గ్రామానికి బయలుదేరుతున్న ఆమెను ముత్తు అడ్డుకుని, తన బాకీ ఇచ్చి వెళ్లాలని చెప్పారు. దీంతో ఆమె కుమారుడు వెంకటేష్(9)ను ఇక్కడే వదిలి.. బాకీ చెల్లించి తీసుకెళతానని చెప్పి వెళ్లారామె. అప్పట్నుంచి వెంకటేష్ తన తల్లితో ఫోన్‌లో తరచూ మాట్లాడుతుండే వాడు. ఇటీవల నెల రోజులుగా పిల్లాడు ఫోన్ చేయడం లేదని ఆందోళన చెందిన అంకమ్మ.. వారం కిందట సత్యవేడుకు వచ్చి ముత్తు వద్ద తన కుమారుడి గురించి అడిగారు. తమిళనాడు రాష్ట్రం కంచి పరిసరాల్లో బాతులు మేపేందుకు వెళ్లగా తప్పిపోయాడని వెతికి తీసుకొస్తామని, కొంత గడువు ఇవ్వాలని అతడు అడిగారు. మళ్లీ రెండు రోజుల క్రితం ఆమె సత్యవేడుకు వచ్చి.. బాకీ మొత్తం చెల్లించేస్తానని, తన కుమారుడిని ఇవ్వాలని కోరారు. ఇంకా పిల్లాడు దొరకలేదని, తాము వెతికే పనిలోనే ఉన్నామని ముత్తు చెప్పారు. దీనిపై ఆమె గట్టిగా తన కుమారుడు కావాలని పట్టుబట్టారు. దీంతో ముత్తు, అతడి భార్య ధనభాగ్యం, కుమారుడు రాజశేఖర్ కలిసి అంకమ్మను కులం పేరుతో దూషించి బయటకు గెంటేశారు. దీంతో ఆమె సత్యవేడు పోలీసులకు సోమవారం ఉదయం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ రామస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పుత్తూరు డీఎస్పీ రవికుమార్ సత్యవేడుకు చేరుకుని విచారించారు. ముత్తు, ఆయన కుటుంబ సభ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతో పాటు వెట్టిచాకిరి కేసులను నమోదు చేశారు. సీఐ మురళి ఆధ్వర్యంలో విచారణ కొనసాగుతోంది. కాగా, పిల్లాడికి ఏమైనా జరిగిందా? తప్పిపోయినట్లు నమ్మిస్తున్నారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



సంఘీభావం తెలుపుతున్న ఉపాధ్యాయ నాయకులు

21న డీఈవో కార్యాలయం ముట్టడి

తిరుపతి(విద్య), మే 19(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ బదిలీ నిబంధనలను సవరించాలని కోరుతూ ఈనెల 21న చిత్తూరు డీఈవో కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక తెలిపింది. ఈ మేరకు సోమవారం తిరుపతిలోని యూటీఎఫ్ భవనంలో సమావేశమై నిర్ణయించారు. ఐక్యవేదిక జిల్లా స్టీరింగ్ కమిటీ ముత్యాలరెడ్డి, జగన్నాథం, సురేష్, సాంబిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడారు. బదిలీలకు సంబంధించి తమ ప్రతిపాదలను పట్టించుకోకుండా ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తోందన్నారు. 117 జీవో రద్దు పేరుతో గతంలో 6 విభాగాలుగా ఉన్న పాఠశాలలను 9 విభాగాలుగా మార్చి చేతులు దులుపుకోవడం ఉపాధ్యాయులకు ఆమోదయోగ్యం కాదన్నారు. 3,4,5 తరగతులను మోడల్‌స్కూల్ పేరుతో తరలించడంవల్ల చాలావరకు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారి చిన్నారులు కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తుందన్నారు. ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించి మోడల్ పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులుగా నియమించాలన్నారు. తమ సమస్యల పరిష్కారానికి స్పందన లభించనందున చిత్తూరు డీఈవో కార్యాలయాన్ని ముట్టడించి నిరసన తెలియజేయనున్నట్టు వెల్లడించారు. ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు దండు రామచంద్రయ్య, బండి మధుసూదన్‌రెడ్డి, సురేష్, వయ్యాల మధు, సుభాష్ చంద్రదాస్, వెంకటరమణ, రెడ్డి శేఖర్, మోహన్‌రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అతివలకు భరోసా వన్‌స్టాప్ సెంటర్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), మే 19(ఆంధ్రజ్యోతి): మిషన్ శక్తి వన్‌స్టాప్ సెంటర్ మహిళలకు భరోసా అని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం మిషన్‌శక్తి వన్‌స్టాప్ సెంటర్ పోస్టర్లను ఆవిష్కరించారు. తిరుపతిలోని మెటర్నటీ ఆస్పత్రిలో ఇప్పటికే మిషన్‌శక్తి వన్‌స్టాప్ సెంటర్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. మహిళలు సామాజికంగా, ఆర్థికంగా, మానసికంగా, లైంగికంగా వేధింపులకు గురైనప్పుడు తక్షణం ఉమెన్ హెల్ప్‌లైన్ నంబర్ 181కు ఫిర్యాదు చేయొచ్చన్నారు. కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, ఐసీడీఎస్ పీడీ వసంతబాయి, డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్, డీసీహెచ్ఎస్ ఆనందమూర్తి, సుజాత పాల్గొన్నారు.

మనమిత్ర సేవలు స్టాండ్ల అందజేత

వాట్సప్ మనమిత్ర ప్రజల చేతిలో ప్రభుత్వ సేవలు అనే స్టాండ్స్‌ను సోమవారం కలెక్టర్ వెంకటేశ్వర్ సచివాలయ సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి నారాయణరెడ్డి, జిల్లా కోఆర్డినేటర్ జగదీష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మామిడి గుజ్జు పరిశ్రమలకు సహకరించండి

మామిడి ఫ్యాక్టరీ యజమానులకు సహాయ సహకారాలు అందించాలని బ్యాంకు అధికారులకు కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. కలెక్టరేట్ నుంచి ఆయన వర్చువల్ విధానం ద్వారా బ్యాంకు అధికారులతో సమీక్షించారు. మ్యాంగో పల్ప్ ప్రాసెసింగ్ పరిశ్రమల్లో రెండేళ్లుగా జ్యూస్ అమ్ముడుపోక చాలా వరకు నిల్వ ఉన్నాయన్నారు. బ్యాంకులకు వారు కట్టాల్సిన వడ్డీని ఆరు మాసాలు పొడిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, ఉద్యానశాఖ అధికారి దశరథరామిరెడ్డి, లీడ్ బ్యాంకు మేనేజరు రవి కుమార్ పాల్గొన్నారు.



పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ



జస్టిస్ దుర్గాప్రసాద్

శ్రీవారి సేవలో ప్రముఖులు



తిరుమల, మే19(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్మెంట్, ఫారెస్ట్ అండ్ క్లైమేట్ ఛేంజ్ కన్సిస్టింగ్ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ భువనేశ్వర్ కలిత, సభ్యులు, ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ దుర్గాప్రసాద్, అలాటి నటి జయచిత్ర, నటి అమరెడ్డి ఉన్నారు.



→ జయచిత్ర - అమరెడ్డి ←



సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌కు కొత్త హంగులు

● 22న వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని

సూళ్లూరుపేట, మే 19 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌ను ఈనెల 22న ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్ పద్ధతిలో ప్రారంభించనున్నారు. అమృత్ భారత్ పథకం కింద రూ.12.77 కోట్లతో ఈ రైల్వేస్టేషన్‌ను ఆధునికీకరించారు. దీని ప్రారంభోత్సవానికి రైల్వే అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

టీచర్ మెడలో చైన్ లాక్కెళ్లారు

తిరుపతి (నేరవిభాగం), మే 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం లక్ష్మీపురం సర్కిల్ సమీపంలోని వినాయక గుడి వద్ద ఉపాధ్యాయుడి మెడలో బంగారు గొలుసు లాక్కెళ్లారు. ఈ ఘటనపై సోమవారం ఫిర్యాదు అందింది. ఈనెల 15వ తేదీన రాయచోటిలో వివాహం కోసం కారులో కొందరు ఉపాధ్యాయులు బయలుదేరారు. ఈ క్రమంలో లక్ష్మీపురం సర్కిల్ వద్ద వీరు బహిర్భూమికి వెళ్లారు. తిరుచానూరుకు దారెటు అంటూ ఓ వ్యక్తి వీరిని అడిగాడు. వీరు సమాధానం చెప్పేలోపే ఉపాధ్యాయుడి మెడలోని 18 గ్రాముల గొలుసు లాక్కెళ్లిపోయాడు. ఉపాధ్యాయుడు అరిచేలోపే సమీపంలో ఉన్న మరో వ్యక్తి ద్విచక్ర వాహనంలో ఆ దుండగుడు పరారయ్యాడు. పెళ్లి అనంతరం తిరిగొచ్చిన కేశవనాయన గుంటకు చెందిన టీచర్ చంగల్ రాజు ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో రూ.1.6 లక్షల జరిమానా

తిరుపతి (నేరవిభాగం), మే 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలో డ్రంకెన్ డ్రైవ్ చేస్తున్న 16 మందిని ట్రాఫిక్ పోలీసులు పట్టుకున్నారు. ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణచారి, సీఐలు సుబ్బారెడ్డి, సంజీవ్ కుమార్, భాస్కర్ నాయక్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు చేసి వీరిని అదుపులోకి తీసుకుని 4వ అదనపు జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచారు. ఒక్కొక్కరికి రూ.పదివేల చొప్పున రూ.1.6 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ సోమవారం తీర్పునిచ్చారు. ట్రాఫిక్ పోలీసులను ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అభినందించారు.

జూన్ మొదటి వారంలో చంద్రగిరి కోటపై వెలుగులు



ఆర్కియాలజీ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే నాని

చంద్రగిరి, మే 19(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి కోటలో ఏపీ టూరిజం కార్పొరేషన్ పీపీపీ విధానంలో లక్స్ అండ్ డెసిబిల్స్ సంస్థ ఏర్పాటు చేసిన సౌండ్ అండ్ లైట్స్ షో జూన్ మొదటి వారంలో ప్రారంభం కానుంది. సోమవారం రాత్రి ఎమ్మెల్యే పులివర్తి నాని కోట ఆర్కియాలజీ అధికారులతో సమీక్షించారు. సౌండ్ అండ్ లైటింగ్ షో ప్రారంభంలో జాప్యానికి కారణాలపై ఆరా తీశారు. మొదట షో ప్రారంభమైనప్పుడు కథ చరిత్ర ఆధారంగా ఉందని, గత ప్రభుత్వంలో మరమ్మతులు చేశాక అందులో మార్పులు చేయడంతో తమశాఖ ఉన్నతాధికారులు అనుమతివ్వలేదని అధికారులు వివరించారు. షోలో ప్రదర్శించే కథను నిర్దేశిత సంస్థ నిర్ధారించాక అనుమతిస్తామన్నారు. టూరింజంశాఖకు బోటింగ్ ఏర్పాటుకు అనుమతించినా కోనేరును శుభ్రం చేయలేదన్నారు. కోటకున్న 55 ఎకరాలకు సంబంధించి రెవెన్యూ, ఆర్కియాలజీ అధికారులు సంయుక్తంగా సర్వేచేసి హద్దులు గుర్తించాలని ఎమ్మెల్యే సూచించారు. కోట ప్రహరీపైనా లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్కియాలజీ కన్సర్వేషన్ అసిస్టెంట్ బాలకృష్ణారెడ్డి కోరారు. మేషన్ రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.


తిరుమలలో కొనసాగుతున్న భద్రతా తనిఖీలు



ఫొటోస్టూడియో వద్ద తనిఖీ చేస్తున్న పోలీసులు

తిరుమల, మే19(ఆంధ్రజ్యోతి): తిరుమలలో భద్రతాతనిఖీలు కొనసాగుతున్నాయి. సోమవారం పోలీసులు, డాగ్, బాంబ్ స్క్వాడ్, విజిలెన్స్ హెల్త్, ఫైర్, విద్యుత్ విభాగాల అధికారులు సిబ్బందితో కలిసి ఏరియా డామినేషన్ నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు పలు ప్రదేశాల్లో తనిఖీలు చేశారు. శ్రీవారిమెట్టు, ఆదిశేషు విశ్రాంతిభవనం, ఎంబీసీ34, ఎస్ఎంసీ, ఏటీసీ వంటి ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. ఇతర ప్రాంతాల నుంచి తిరుమలకు వచ్చిన కూలీలను ప్రత్యేకంగా విచారించారు. వారి వివరాలను సేకరించి, ఎలాంటి ఆధారాలు లేనివారిని తిరుమల నుంచి పంపేశారు. ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో పనులు చేస్తున్న వారి వేలిముద్రలు, ఐరిష్‌లను పరిశీలించి ఏదైనా నేర చరిత్ర ఉందా అనే అంశాలపై ఆరా తీశారు. కొన్ని దుకాణాలు, ఫొటో స్టూడియోలు, ఫ్రూట్ షాపుల వద్ద కూడా తనిఖీలు చేపట్టారు.

నిమ్మ ధరలు ఢమాల్



గూడూరు అర్బన్, మే 19(ఆంధ్రజ్యోతి): గూడూరు మార్కెట్‌లో నిమ్మ ధరలు భారీగా పతనమయ్యాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సీజన్‌లో ధరలు పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏటా ఫిబ్రవరి నుంచి జూన్ వరకు నిమ్మధరలు స్థిరంగా ఉంటూ రైతులకు ఆదాయాన్ని ఇచ్చేవి. వారం రోజుల వరకు కిలో గరిష్టంగా రూ.120 నుంచి రూ.160 ధరలు పలికాయి. ప్రస్తుతం గరిష్టంగా రూ.40 వరకు అమ్ముడవుతున్నాయి. టిక్కీ బస్తా(50 కేజీలు) రూ.1000 నుంచి రూ.2000 పలకడంతో గిట్టుబాటు కావడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేరళకు రవాణా చేసే విషయంలో తమిళనాడు మార్కెట్ నుంచి పోటీ ఎక్కువ కావడంతో గూడూరులో ధరలు తగ్గిపోయాయని స్థానిక వ్యాపారులు పేర్కొంటున్నారు.